Bhavani Publication Trust

https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక



కావలెను

ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక
The Largest Circulated Telugu Fortnightly

సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహావంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యులేషన్ ఇన్‌చార్జిలు కావలెను

వెంటనే కావలెను
- బ్యూరో ఇన్‌చార్జిలు
- స్టాఫ్ రిపోర్టర్లు
- ఆర్‌సి ఇన్‌చార్జిలు
- మండల రిపోర్టర్లు

అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622



సంపుటి : 26 | సంచిక : 291 | హైదరాబాద్ | శుక్రవారం 04 సెప్టెంబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR


# సవాల్‌కే సవాల్!

## కేసీఆర్ రాజీనామా చేయాలన్న సీఎం



- స్వీకరిస్తే ప్రజాప్రభుత్వానికి కష్టాలే?
- రాజీనామాలు గులాబీ నేతకు కొత్తకాదు..
- గెలిస్తే ఆకాశానికి బీఆర్ఎస్ గ్రాఫ్
- ఒక్క దెబ్బకు రెండు పిట్టలు
- ఇటు కాంగ్రెస్‌కు కళ్లెం.. అటు బీజేపీకి బంధం
- మాజీ సీఎం కేసీఆర్ నిర్ణయంపై ఆసక్తి?

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

అధికారం చేపట్టిన నాటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను టార్గెట్ చేశారు. ఏ చిన్న అవకాశం వచ్చినా ఆయనపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. వాస్తవానికి కేసీఆర్‌పై ఆయన విసిరిన ఆరోపణాస్త్రాలే ఈ రోజు రేవంత్‌ను సీఎం సీటుపై కూర్చొబెట్టాయి. తాజాగా కేసీఆర్‌ను కార్నర్ చేయాలనే ఉద్దేశంతో కేసీఆర్ రాజీనామా చేయాలనే డిమాండ్ తెలంగాణ రాజకీయాల్లో కొత్త వేడిని రాజేసింది. ఇంట్లో కూర్చొని కోట్ల వేతనం పొందుతున్నారని ఆరోపించేందుకు, కేసీఆర్‌ను ఆత్మరక్షణలోకి నెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఈ అస్త్రాన్ని ఉపయోగించినప్పటికీ, ఈ సవాల్‌ను గులాబీ అధినేత స్వీకరిస్తే మాత్రం చోటు చేసుకుని రాజకీయ పరిణామాలు పార్టీల దశాదిశను మార్చేస్తాయని అంటున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి విసిరిన సవాల్ బూమరాంగ్ అవుతుందా? ఒక వేళ బీఆర్ఎస్ అధినేత ఆ సవాల్‌ను స్వీకరిస్తే కాంగ్రెస్‌కు కష్టమైనా? లేక కాంగ్రెస్ పద్మవ్యూ హంలో గులాబీ పార్టీ చిక్కుకుని విలవిలలాడుతుందా? నిజంగా కేసీఆర్ గజ్వేల్ నుంచి రాజీనామా చేసి ఉప ఎన్నికలకు వెళ్లితే రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్‌కు మళ్లీ బూస్టింగ్ వస్తుందా అన్న చర్చ పొలిటికల్ సర్కిల్‌లో జోరుగా సాగుతోంది.

### రాజీనామాలు ఆయనకు ఈజీ

తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు ఉద్యమాన్ని నడిపిన కేసీఆర్‌కు రాజీనామాలు కొత్త కాదు. అవసరాన్ని బట్టి ఆయన ఉప ఎన్నికల వ్యూహాన్ని ఎంచుకునే వారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కాలంలో కేసీఆర్ రాజీనామాలను ఒక రాజకీయ ఆయుధంగా మలచుకుని, సెంటిమెంట్‌ను

-2వ పేజీలో



# భారత ఆర్థిక వృద్ధితో కొత్త అవకాశాలు

ఢిల్లీలో బెల్జియం ప్రధాని బార్ట్ డి వేవెర్‌తో మోదీ సమావేశం

## కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 04 (ప్రజాతీర్పు)

వాణిజ్యం, రక్షణ, కీలక ఖనిజాలు, స్వచ్ఛ ఇంధనం, టెక్నాలజీ సహా కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని భారత్, బెల్జియం నిర్ణయించుకున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, బెల్జియం ప్రధానమంత్రి బార్ట్ డి వేవెర్ గురువారం ఢిల్లీలో సమావేశమయ్యారు. ఇరుదేశాల సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా రక్షణ సంబంధాలను పెంపొందించుకోవడం, పునరుత్పాదక ఇంధన రంగంలో సహకారం

- మిగతా 2వ పేజీలో



# వచ్చేస్తోంది సూపర్ ఎల్‌నినో!

హెచ్చరిక జారీ చేసిన డబ్ల్యూఎంఓ

- వచ్చే ఏడాది వరకూ కొనసాగే అవకాశం
- భారత్‌పై ప్రభావం తీవ్రం
- రానున్న 3 నెలలు భగభగలు!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 04 (ప్రజాతీర్పు)

ఇప్పటికే వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్న భారతదేశానికి అంతర్జాతీయ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) పిడుగులాంటి వార్తను మోసుకొచ్చింది. ఈ ఏడాది మొదలైన ఎల్‌నినో వచ్చే ఏడాది మొదటి వరకూ కచ్చితంగా కొనసాగుతుందని హెచ్చరించింది. ఫలితంగా మరిన్ని వాతావరణ విపత్తులు, వడగాడ్పులు, అకాల వర్షాలు, వరదలు తప్పవన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దక్షిణ అమెరికా వద్ద భూమధ్య రేఖ ప్రాంతంలోని పసఫిక్ మహాసముద్రపు ఉపరితల జలాల ఉష్ణోగ్రతలు కొంచెం పెరిగితే దాన్ని ఎల్‌నినో అంటారన్నది తెలిసిన విషయమే. నాలుగైదేళ్ల విరామంతో వచ్చే ఈ వాతావరణ దృగ్విషయం ప్రపంచ వాతావరణంపై మరీ ముఖ్యంగా భారతదేశానికి కీలకమైన నైరుతీ రుతుపవనాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఎల్‌నినో వచ్చిన సంవత్సరాల్లో రుతుపవనాలు

- మిగతా 2వ పేజీలో



# కొండా సురేఖ బర్తరఫ్

మంత్రివర్గం నుంచి తొలగింపు

## సీఎం రేవంత్‌రెడ్డి సిఫార్సును ఆమోదించిన గవర్నర్

## ప్రణాళికా సంఘం నుంచి చిన్నారెడ్డికి ఉద్వాసన

## ముగ్గురు బీసీ మహిళలకు పదవులు

హైదరాబాద్, సెప్టెంబరు 04 (ప్రజాతీర్పు)

కొండా సురేఖపై వేటు పడింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిఫార్సు మేరకు మంత్రివర్గం నుంచి తొలగిస్తూ గవర్నర్ శివప్రతాప్ శుక్లా గురువారం నిర్ణయం తీసుకున్నారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు మంత్రివర్గం నుంచి సురేఖను బర్తరఫ్ చేయాలన్న ముఖ్యమంత్రి, పీసీసీ సిఫార్సుపై అధిష్ఠానం విస్తృతంగా చర్చలు జరిపిన తర్వాత నిర్ణయం తీసుకుంది. దీంతో గత కొన్నిరోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. రెండేళ్ల తొమ్మిది నెలలు సురేఖ మంత్రిగా పనిచేశారు. వనపర్తి ఎమ్మెల్యే టికెట్

- మిగతా 2వ పేజీలో

## పది రోజుల్లో 'సాగర్'

# నీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలి

లేదంటే కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేస్తా

## మిర్యాలగూడ రైతు మహాధర్నాలో కేటీఆర్



నల్గొండ, సెప్టెంబరు 04 (ప్రజాతీర్పు)

నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాల్వ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు నీరు తరలివెళుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్టించుకోవడం లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సెప్టెంబరు 13లోపు సాగర్ ఎడమకాల్వ పరిధిలో ఉన్న ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలకు సాగర్ నీటి షెడ్యూల్ ప్రకటించి సమృద్ధిగా తడులు అందించాలని, లేదంటే కోదాడ నుంచి హాలియా వరకు బాధిత రైతులతో కలిసి పాదయాత్ర చేస్తామని

- మిగతా 2వ పేజీలో

# ఎన్నికల నాటికి మెట్రోలోనే వస్తా!

## 620 కోట్లతో నిర్మించిన నల్లగొండ క్రాస్‌రోడ్స్ స్టీల్ బ్రిడ్జి ప్రారంబోత్సవంలో రేవంత్

- చాంద్రాయణగుట్ట మెట్రో మార్గాన్ని తదుపరి ఎన్నికల్లోగా అందుబాటులోకి తెస్తామని వెల్లడి
- హైదరాబాద్ అభివృద్ధికి హిందువులు, ముస్లింలు కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపు
- అసదుద్దీన్, ఎంఐఎం దేశానికి వ్యతిరేకమని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు... దేశభక్తిలో మోదీ, అమిత్ షాకన్నా ఒవైసీ తక్కువేమీ కాదని వ్యాఖ్య



హైదరాబాద్, సెప్టెంబరు 04 (ప్రజాతీర్పు)

ఓల్డ్ సిటీ (ఒరిజినల్ సిటీ) సమగ్ర అభివృద్ధి తమ లక్ష్యమని, ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా మీదుగా చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ. మెట్రో మార్గం పనులను ఈ ఏడాది డిసెంబర్‌లో ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వచ్చే ఎన్నికల నాటికి ఈ మార్గాన్ని పూర్తిచేసి మెట్రోలోనే వచ్చి ప్రజలను ఓట్లు అడుగుతామని ధీమా వ్యక్తం చేశారు. నల్లగొండ క్రాస్‌రోడ్స్ఒవైసీ జంక్షన్ వరకు రూ. 620 కోట్లతో సిగ్నల్ ఫ్రీగా జీహెచ్ఎంసీ నిర్మించిన స్టీల్ బ్రిడ్జిని సీఎం రేవంత్‌రెడ్డి గురువారం సాయంత్రం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో కలిసి ప్రారంభించారు. అనంతరం చంచల్‌గూడ జూనియర్ కళాశాలలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. చాంద్రాయణగుట్ట మెట్రో కోసం భూసేకరణ దాదాపు పూర్తయిందని.. మెట్రో పనులను వేగంగా చేపట్టి తదుపరి ఎన్నికల్లోగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ఈ వంతెనకు శంకుస్థాపన చేసి కొబ్బరికాయ కొట్టడం తప్ప రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు పూర్తి చేసిందన్నారు. నాగోలు నుంచి ఎల్బీనగర్, వనస్థలిపురం, చాంద్రాయణగుట్ట, రాజేంద్రనగర్, శంషాబాద్ వరకు మెట్రో విస్తరణకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని సీఎం చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధికి హిందువులు, ముస్లింలు

- మిగతా 2వ పేజీలో

# తమిళనాడులో కొత్త శాసనసభ, సచివాలయం

ఆ రాష్ట్ర సీఎం విజయ్ వెల్లడి



చెన్నై, సెప్టెంబరు 04

తమిళనాడులో కొత్త శాసనసభ, సచివాలయ భవన సముదాయాన్ని నిర్మించాలని విజయ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.1,200 కోట్లను కేటాయించాలని నిర్ణయించినట్లు తమిళనాడు సీఎం విజయ్ ప్రకటించారు. ఈ నిర్మాణాలు వందేళ్ల పాటు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతామని గురువారం అసెంబ్లీలో ఆయన ప్రకటించారు. అలాగే, ప్రస్తుతం ఉన్న సెయింట్ జార్జ్ కోట భవనాలను రాబోయే తరాల కోసం వారసత్వ చిహ్నాలుగా భద్రపరుస్తామని చెప్పారు. ఒలింపిక్ సిటీ, మోటార్ స్పోర్ట్స్ సిటీలకు కూడా రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు.



# బీజేపీ సెక్రటేరియట్ ముట్టడి ఉద్రిక్తం

బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపీ డీకే అరుణ, మహేశ్వర్‌రెడ్డి తదితరుల అరెస్ట్

## ఫీజు బకాయిలపై సీఎంకు వినతిపత్రం ఇచ్చే ప్రయత్నం...అడ్డుకున్న పోలీసులు

హైదరాబాద్, సెప్టెంబరు 04 (ప్రజాతీర్పు)

రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు నేతృత్వంలో చేపట్టిన సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతలకు దారితీసింది. మెయిన్ గేటు వద్ద రాంచందర్‌రావుతో పాటు, ఎంపీ డీకే అరుణ, బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మల్కకొమరయ్య, పార్టీనేతలు డా.ఎన్.గౌతంరావు, బండారు విజయలక్ష్మి, బీజైవైఎం అధ్యక్షుడు గణేష్ కుండే

- మిగతా 2వ పేజీలో

# ఎన్నికల నాటికి మెట్రోలోనే వస్తా!

(మొదటి పేజీ తరువాయి)

కలిసి ముందుకు సాగాలని సీఎం పిలుపునిచ్చారు. ఉభయులూ కలిస్తేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమ న్నారు. మూసీ రివర్‌ఫ్రంట్, నైట్ ఎకానమీ వంటి ప్రాజెక్టుల ద్వారా పేద ముస్లింలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. అభివృద్ధికి బీజేపీ, బీఆర్ఎస్ అడ్డంకులు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని.. మిగతా సమయంలో హైదరాబాద్ అభివృద్ధి కోసం అన్ని పార్టీలు, వర్గాలు కలిసి పనిచేయాలని సీఎం సూచించారు. ఓల్డ్ సిటీని ఒరిజినల్ సిటీగా మరోమారు పేర్కొన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఇక్కడి ప్రతి వీధి, సందు తనకు తెలుసన్నారు. గత 70 ఏళ్లలో 18 మంది సీఎంలు పనిచేసినా చంచల్‌గూడకు రాలేదన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. 'నేను బెదిరిస్తే భయపడను. ఎవరి ధమ్కీలకూ బెదరను. ప్రేమకే లొంగుతా. స్నేహంతోనే నన్ను గెలవగలరు. నేను దోస్తీకి మాత్రమే గులామ్‌ను. ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి.. గెలుపోటములు సహజం'అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అసదుద్దీన్, ఎంఐఎం దేశానికి వ్యతిరేకమని కొందరు దుష-ప్రచారం చేస్తున్నారని సీఎం విమర్శించారు. ఆపరేషన్‌సిందూర్ సమయంలో దేశం పక్షాన నిలిచిన అసదుద్దీరీన్= ఒవైసీని అభినందించారు.

ఈ అంశంలో అసద్.. మోదీ, అమిత్ షాల కంటే తక్కువేమీ కాదన్నారు. మీరాలం చెరువు వద్ద 3 కి.మీ. కేబుల్ బ్రిడ్జి నిర్మాణం, హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్ల ఏర్పాటు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు సీఎం పేర్కొన్నారు. మెట్రో రెండో దశలో నాగోల్ నుంచి ఎల్బీ నగర్, వనస్థలిపురం, చాంద్రాయణగుట్ట, రాజేంద్రనగర్, శంషాబాద్ వరకు విస్తరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అసదుద్దీన్ ఒవైసీ ఎన్ని అభివృద్ధి ప్రతిపాదనలు తెచ్చినా మంజూరు చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజహరుద్దీన్, రాజ్యసభ ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నవీన్‌కుమార్ యాదవ్, దానం నాగేందర్, జాఫర్ మెరాజ్ హుస్సేన్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

**పార్టీకి కాదు.. రేవంత్‌కే మా మద్దతు: అసదుద్దీన్ ఒవైసీ**

'ఇక్కడ కూర్చున్న కాంగ్రెస్ నాయకుల అందరి ముందు చెబుతున్నా. మా పార్టీ మద్దతు కాంగ్రెస్‌కు కాదు.. కేవలం రేవంత్‌రెడ్డికే. ఇందులో ఎలాంటి సందేహం లేదు. గతంలో బీఆర్ఎస్‌కు మద్దతిచ్చిన మాట వాస్తవం. కానీ ప్రజావ్యతిరేక పనులను ఆపాలని.. లేకపోతే ఇంట్లోనే కూర్చోవాల్సి వస్తుందని చెప్పా.. అలాగే జరిగింది. ప్రస్తుతం రేవంత్ సైతం ప్రజల్లోకి రావట్లేదు. అందుకు ఎవరు అడ్డుపడుతున్నారో తెలియదు'అంటూ హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించారు. రాష్ట్రం వెలుపల ఏదైనా మాట్లాడొచ్చని.. కానీ రాష్ట్రంలో మాత్రం తమకు వ్యతిరేకంగా మాట్లాడవద్దన్నారు. కాగా, చంచల్‌గూడ మైదానంలో ఉన్న పాఠశాలలు, కాలేజీల అభివృద్ధికి రూ. 20 కోట్లు మంజూరు చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలా సీఎంకు వినతిపత్రం ఇవ్వగా రూ. 25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

# భారత ఆర్థిక వృద్ధితో కొత్త అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి)



సహా ఇతర అంశాలకు సంబంధించి ఐదు ఒప్పందాలపై రెండు దేశాలు సంతకాలు చేశాయి. రాబోయే ఐదేళ్లలో వార్షిక ద్వైపాక్షిక వాణిజ్య పరిమాణాన్ని రెట్టింపు చేయాలన్ని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి. అనంతరం మోదీ, వేవెర్ సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. గత త్రైమాసికంలో భారత్ సాధించిన 7.8 శాతం ఆర్థిక వృద్ధిని నరేంద్ర మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. భారతదేశం ఎదుగుదలను ప్రపంచ విశ్వాసానికి, కొత్త అవకాశాలకు మూలకారణంగా అభివర్ణించారు. నేడు ప్రపంచం సంక్షోభ కాలాన్ని ఎదుర్కొంటోందని గుర్తుచేశారు. అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయని, అనిశ్చితి వల్ల ఆహారం, ఇంధనం, సప్లై చైన్లు సహా ప్రతి రంగం ప్రభావితమవుతోందని పేర్కొన్నారు. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా భారత ఆర్థిక వ్యవస్థ పరుగు ఎక్కడా ఆగడం లేదన్నారు. గత త్రైమాసికంలో ఏకంగా 7.8 శాతం వృద్ధిని నమోదు చేయడం ప్రశంసనీయమని ఉద్ఘాటించారు. భారత్, బెల్జియం మధ్య రక్షణ, భద్రతా సహకారాన్ని మొత్తం సంబంధాలకు మూలస్తంభంగా మోదీ అభివర్ణించారు. రెండు దేశాల మధ్య సైనిక మార్పిడులు, శిక్షణా సహకారాన్ని పెంపొందించుకోవడానికి అంగీకరిం చామని చెప్పారు. ఇరుదేశాల ప్రభుత్వాలు, రక్షణ పరిశ్రమల మధ్య కుదిరిన ఒప్పందాలు రక్షణ సహఅ భివృద్ధి, సహఉత్పత్తికి కొత్త అవకాశాలను తెరుస్తాయని స్పష్టంచేశారు. నేరాల నిర్మూలనలో రెండు దేశాల ఏజెన్సీల మధ్య నిఘా సమాచార మార్పిడి, సహకారాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. భారత్, బెల్జియం ప్రజల మధ్య సంబంధాలే ఇరుదేశాల బంధానికి అతిపెద్ద బలం అని ప్రధానమంత్రి వెల్లడించారు. స్టార్టప్‌ల మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి, మారిటైమ్ రంగంలో సహకారాన్ని పెంపొందించడానికి ఇరుపక్షాలు అంగీకరించాయని తెలిపారు. విశ్వవిద్యాలయ, పరిశోధన సహకారాన్ని కూడా బలోపేతం చేస్తామన్నారు. ప్రతిభావంతుల బదిలీని సులభతరం చేయడానికి, త్వరలో 'వలస, బదిలీ భాగస్వామ్య ఒప్పందం'కుదుర్చుకుంటామని తెలియజేశారు. చట్టబద్ధ పాలన, సంప్రదింపులు, దౌత్యంపై భారత్, బెల్జియం దేశాలకు ఎనలేని విశ్వాసం ఉందన్నారు. పునరుత్పాదక ఇంధనంపై నేడు కుదిరిన అవగాహన ఒప్పందం మన సుస్థిరత సహకారానికి కొత్త ఊపునిస్తుందని మోదీ వివరించారు.

భారత్‌యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడం పట్ల బెల్జియం ప్రధానమంత్రి వేవెర్ హర్షం వ్యక్తంచేశారు. ఇదొక గొప్ప మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. అలాగే భారత్, బెల్జియం దేశాలు గతంలో కంటే విస్తృతమైన, మరింత వ్యూహాత్మకమైన సంబంధాలను నిర్మించుకుంటున్నాయని వివరించారు.

## పది రోజుల్లో 'సాగర్'
# నీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)



ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ ఎన్ఎస్పీ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన రైతు మహా ధర్నా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. "మేము ధర్నా చేస్తామని అనగానే ప్రభుత్వానికి చలిజ్వరం వచ్చింది. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఉమ్మడి నల్గొండ జిల్లావ్యాప్తంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా మూడు పంటలకు నీళ్లిచ్చాం. రైతుబంధు ఎప్పటికప్పుడు రైతు ఖాతాల్లో జమచేశాం. నిరంతరాయంగా విద్యుత్తు అందించాం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో మాత్రం సాగర్ పరీవాహక ప్రాంతాల్లో సాగునీరు లభ్యం కావడం లేదు. మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టారు. కౌలు రైతులకు రైతు భరోసా లేదు. కేసీఆర్ పాలనలో మిర్యాలగూడ రైస్‌బౌల్ ఆఫ్ తెలంగాణగా నిలిస్తే నేడు సాగు చేసేందుకు నీటి నిల్వలు లేక రైతు మహాధర్నా నిర్వహించాల్సి వస్తోంది. ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ రైతు డిక్లరేషన్ పేరిట 33 హామీలు ఇచ్చారు. కానీ మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టి, రైతులకు రుణమాఫీ ద్రోహం చేశారు.

**సాగర్‌లో నీళ్లున్నా మంత్రులకు సోయి లేదు**

శ్రీశైలం ప్రాజెక్టులో 537 అడుగుల నీళ్లున్నా నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతులకు కన్నీటిని తెప్పిస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏవేవో మాట్లాడుతున్నారు. జిల్లాలోని వీరిద్దరికీ రైతుల సమస్యలపై ఎలాంటి సోయి లేదు. నాగార్జునసాగర్‌లో 180 టీఎంసీల నీళ్లున్నా ఎడమకాల్వ ఆయకట్టుకు ఎందుకు ఇవ్వడంలేదు. నికర జలాలున్నప్పటికీ వరద జలాలపై ఆధారపడ్డ ఆంధ్రప్రదేశ్‌లోని వెలిగొండ, పోతిరెడ్డి ప్రాజెక్టులకు నీటిని ఏపీ సీఎం చంద్రబాబు తరలించుకుపోతుంటే కళ్లప్పగించి చూస్తున్నారు. సెప్టెంబరు 7 నుంచి జరిగే శాసనసభ సమావేశాల్లో రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం. అసెంబ్లీలోనూ ప్రభుత్వం స్పందించకపోతే వినాయకచవితి తర్వాత నాడు కేసీఆర్ చేసిన పాదయాత్ర మాదిరిగా కోదాడ నుంచి హాలియా వరకు రైతులతో కలిసి పాదయాత్ర చేపడతా" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను డిజిటల్ తెరలపై ప్రదర్శించారు.

**ధర్నాకు హాజరైన కార్యకర్తలు, రైతులు**

ఏ హక్కులేని ఏపీ నీటిదోపిడీ: జగదీశ్‌రెడ్డి

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ సాగర్ ప్రాజెక్టుపై ఏ హక్కులేని ఏపీ ప్రభుత్వం కుడికాల్వ నీళ్లు దోచుకుంటుంటే ఎడమ కాల్వ రైతులు ప్రధానంగా నల్గొండ, ఖమ్మం జిల్లాల వారు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. బాధిత రైతులు తమ ఆవేశాన్ని మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిలపై చూపించి నీటిని సాధించాలన్నారు. నాడు కేసీఆర్ పాదయాత్ర చేసి నాటి సీఎం చంద్రబాబు మెడలు వంచి సాగర్ నీరు విడుదల చేయించినట్లుగా.. కేటీఆర్ సైతం నేడు పాదయాత్ర చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, పార్టీ నాయకులు బడుగుల లింగయ్య యాదవ్, నల్లమోతు భాస్కర్‌రావు, రవీంద్రనాయక్, కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, గాదరి కిశోర్ కుమార్, నోముల భగత్, తిప్పన విజయసింహారెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, రాకేశ్‌రెడ్డి, సిద్ధార్థ, ఒంటెద్దు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొండా సురేఖ బర్తరఫ్

(మొదటి పేజీ తరువాయి)

విషయంలో పార్టీపై విమర్శలు చేసిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని సైతం తొలగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కొండా సురేఖపై వేటుకు నిర్ణయం వెలువడగానే ముగ్గురు బీసీ మహిళలను కీలక పదవుల్లో ప్రభుత్వం నియమించింది. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి కాంగ్రెస్ అధిష్ఠానంతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జితో పలు దఫాలు విస్తృతంగా చర్చోపచర్చల అనంతరం, ముఖ్యమంత్రిపై నేరుగా విమర్శలు చేయడాన్ని తీవ్రంగా పరిగణించిన అధిష్ఠానం చర్య తీసుకోవాలని నిర్ణయించింది. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ క్రమశిక్షణ తప్పకుండా చూడటానికి సురేఖ, చిన్నారెడ్డిలపై వేటు వేయడానికి అంగీకరించిందని, ముఖ్యమంత్రి కూడా ఎలాంటి పరిస్థితిలో ఉపేక్షించరాదనే నిర్ణయానికి వచ్చారని కాంగ్రెస్‌కు చెందిన సీనియర్ నాయకుడొకరు వ్యాఖ్యానించారు.

సినీనటుడు నాగార్జున కుటుంబంపై వ్యాఖ్యలు చేసిన అంశాన్ని అధిష్ఠానం తీవ్రంగా పరిగణించినా ముఖ్యమంత్రి సర్దిచెప్పారని, ఓఎస్డీని తొలగిస్తూ నిర్ణయం తీసుకొన్నప్పుడు సురేఖ కుమార్తె విమర్శలు చేసినా పార్టీలోని కొందరు సీనియర్ నాయకుల జోక్యం, కొండా దంపతులు కూడా కలిసి మాట్లాడటంతో మిన్నకుండిపోయారని, కానీ ఈసారి మాత్రం చర్య తీసుకోవాల్సిందేనని నిర్ణయించుకొన్న సీఎం రేవంత్ అధిష్ఠానాన్ని ఒప్పించి సురేఖ, చిన్నారెడ్డిలపై చర్య తీసుకొన్నారనే అభిప్రాయం పార్టీవర్గాల్లో వ్యక్తమవుతోంది.

**సీఎం వరంగల్ జిల్లా పర్యటనతో...**

కొంతకాలంగా కొండా సురేఖ విషయంలో ముఖ్యమంత్రి అసంతృప్తితో ఉన్నా, గత నెల 16న ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో నెలకొన్న పరిణామాలు సమస్య తీవ్రతను పెంచాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడారం, ములుగు, పరకాలలో పర్యటించగా ఆ జిల్లాకే చెందిన, పైగా దేవాదాయశాఖ మంత్రిగా ఉన్న సురేఖ గైర్హాజరయ్యారు. ఆ పర్యటనలో చివరిగా పరకాలలో జరిగిన బహిరంగసభలో పాల్గొన్న సీఎం వచ్చే ఎన్నికల్లో సిటింగ్ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తర్వాత రెండు రోజులకే ఈ నియోజకవర్గంలో ఓ సభలో పాల్గొన్న సురేఖ కుమార్తె ముఖ్యమంత్రిపైన, కుటుంబ సభ్యులపైన, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిపైన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలపైనా మంత్రిగా ఉన్న సురేఖ ఏమీ మాట్లాడలేదు.. ఖండించనూ లేదు. దీంతో ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీరియస్‌గా తీసుకొన్నారు. పీసీసీ అధ్యక్షుడు, పీసీసీ క్రమశిక్షణ కమిటీ కూడా కఠిన చర్యలు తీసుకోవాలనే పేర్కొంది. గతంలో తాను సర్దిచెప్పగలిగానని, ఇప్పుడేమీ చేయలేనని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ అధిష్ఠానంలో కీలకమైన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి(ఆర్గనైజేషన్) కేసీ వేణుగోపాల్ విదేశాల్లో ఉండటం, పది రోజులపాటు ఎలాంటి చర్యలు లేకపోవడం, రాఖీ పండగరోజు సురేఖ రేవంత్‌రెడ్డిని కలవడం, ఒకరిద్దరు మంత్రులు చర్య వద్దనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు ప్రచారం జరగడంతో వేటు ఉండకపోవచ్చనే అభిప్రాయం పార్టీవర్గాల్లో వ్యక్తమైంది. అయితే వేణుగోపాల్ ఒకటో తేదీన విదేశాల నుంచి రాగా, అదేరోజు సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీ వెళ్లి ఆయనను కలిసి సురేఖ, చిన్నారెడ్డిలపై చర్య తీసుకోవాల్సిన అవసరాన్ని, చర్య తీసుకోకుంటే ఎదురయ్యే పరిణామాల గురించి చర్చించారు. ఖర్గేను కూడా కలిసి మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షినటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలతో కూడా కేసీవేణుగోపాల్, ఖర్గేలు మాట్లాడారు. సురేఖ కూడా దిల్లీ వెళ్లి ఖర్గేను మాత్రమే కలిశారు. బుధవారం మధ్యాహ్నమే సురేఖ, చిన్నారెడ్డిలపై వేటు వేస్తూ నిర్ణయం వెలువడుతుందనే ప్రచారం జరిగింది. అధిష్ఠానం ముఖ్యమంత్రి అభిప్రాయంతో ఏకీభవించిందని, పీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి కూడా ఇదే అభిప్రాయాన్ని బలపరచడంతో.. నిర్ణయం తీసుకొన్నట్లు పార్టీవర్గాలు పేర్కొన్నాయి. అయితే రాత్రి వరకు ఎలాంటి నిర్ణయం వెలువడకపోవడంతో అధిష్ఠానం ఇంకా తర్జనభర్జన పడుతుందనే అభిప్రాయం వ్యక్తమైనా.., కేసీవేణుగోపాల్ గురువారం మధ్యాహ్నం సోనియాగాంధీని కూడా కలిసి మాట్లాడిన తర్వాత తుది నిర్ణయం తీసుకొన్నట్లు తెలిసింది.

# సవాల్‌కే సవాల్!

(మొదటి పేజీ తరువాయి)

రగిలించి విజయం సాధించేవారు. ప్రతీ ఉపఎన్నికలో తన ఆధిపత్యాన్ని చాటుకుని దేశవ్యాప్తంగా ప్రజల దృష్టిలో పడ్డారు. ప్రస్తుతం బీఆర్ఎస్ కొంత డొలాయామాన పరిస్థితుల్లో ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన అన్ని ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలను చవి చూసింది. దీంతో నేతల్లోనే కాకుండా కేడర్‌లో కూడా తెలియని భయం వెంటాడుతోంది. మరోపక్క వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇప్పుడిప్పుడే జనంలో అసంతృప్తి రేగుతుందన్న భావన ఉంది. ఈ క్రమంలో మాజీ సీఎం కేసీఆర్ మళ్లీ తన రాజీనామా అస్త్రాన్ని బయటకు తీసి జనంలోకి వస్తే పార్టీకి కొత్త ఊపు వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

**బీఆర్ఎస్‌కు బూస్టింగ్..**

ఒకవేళ గజ్వేల్ ఉపఎన్నిక అనివార్యమైతే, అది రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చివేస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కొందరు ఎమ్మెల్యేలు సైతం బీఆర్ఎస్‌ను వదిలి వెళ్లారు. మరోపక్క బీజేపీ లోక్‌సభ ఎన్నికల తర్వాత తన బలం పెంచుకుంది. వచ్చే ఎన్నికల్లో తామే ప్రధాన పోటీదారు అంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ రంగంలోకి దిగితే కాంగ్రెస్, బీజేపీ రెండూ ఇరకాటంలో పడినట్లే అన్న భావన బీఆర్ఎస్ కార్యకర్తల్లో ఉంది. ఇదే సరైనా సమయం అని.. కేసీఆర్ రాజీనామా చేసి రంగంలోకి దిగితే రేసు కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్‌గా మాతుందని అంటున్నారు. ఇదే నిజమైతే ఇటు కాంగ్రెస్‌ను కట్టడి చేయడంతో పాటు బీజేపీకి బ్రేక్ వేసినట్లు అవుతుందని భావిస్తున్నారు.

**కేసీఆర్ నిర్ణయమే ఫైనల్..**

రాజీనామా డిమాండ్ విషయంలో మాజీ సీఎం కేసీఆర్ నిర్ణయం ఎలా ఉంటుందనే దానిపై చర్చ జరుగుతుంది. ఇప్పుడు నిజంగా రాజీనామా చేస్తే రేవంత్‌రెడ్డి విమర్శకు బయపడి రాజీనామా చేసినట్లు అయి.. అది కాంగ్రెస్‌కే మేలు చేస్తుందా? అన్న చర్చ కూడా జరుగుతుంది. అలాకాకుండా, ఇంటికే పరిమితమయ్యారన్న అపవాదును దాటి త్వరలోనే ఆయన జనంలోకి రావాలని భావిస్తున్నారు. ఈ మేరకు భారీ బహిరంగ సభకు ప్లాన్ చేస్తున్నారన్న చర్చ కూడా సాగుతుంది. ఏది ఏమైనా కేసీఆర్ మళ్లీ జనంలోకి రావాలని, అప్పుడే పార్టీకి మళ్లీ ఊపు వస్తుందని సామాన్య కార్యకర్తలు భావిస్తున్నారు.

# వచ్చేస్తోంది సూపర్ ఎల్‌నినో!

(మొదటి పేజీ తరువాయి)

బలహీనంగా ఉండటమే కాకుండా... వడగాడ్పులు పెరుగుతూంటాయి. అకాల వర్షాలు, వరదలు నమోదవుతూంటాయి. 2026లోనూ ఎల్‌నినో ఏర్పడిందని, ఇది చరిత్రలో ఎన్నడూ లేనంత తీవ్రంగా ఉండవచ్చునన్న అంచనాలను ప్రపంచ వాతావరణ సంస్థ ఈ ఏడాది మధ్యలోనూ ఇచ్చింది. అయితే తాజాగా గురువారం జారీ చేసిన ప్రకటనలో మాత్రం ఈసారి సూపర్ ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడటం వందకు వంద శాతం పక్కా అని తేల్చి చెప్పింది. చరిత్రలోనే అతిపెద్ద ఎల్‌నినోగా అవతరించనుందని, 2027 ఫిబ్రవరి నెల వరకూ ఈ పరిస్థితులు కొనసాగవచ్చని స్పష్టం చేసింది. పసఫిక్ మహా సముద్ర ప్రాంతంలోని ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణ రీతిలో ఉండటం దీనికి కారణమవుతోందని తెలిపింది.

**రెండున్నర డిగ్రీలు ఎక్కువ...**

పసఫిక్ మహా సముద్రంలో ఎల్‌నినో పరిస్థితులను అంచనా కట్టేందుకు కొన్ని నిర్దిష్ట ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూంటారు. అలాంటి ప్రాంతాల్లో ఒకటైన 'ద నినో 3.4'లో ఈ ఏడాది ఉష్ణోగ్రతలు చాలా అసాధారణంగా ఉన్నట్లు తెలిసింది. మేజూలై నెల మొదటి వరకూ ఇక్కడి ఉష్ణోగ్రతలు సగటు కంటే 1.5 డిగ్రీ సెల్సియస్ ఎక్కువగా ఉంటే జూలై నెలలో రెండు డిగ్రీలకు పెరిగింది. ఆ తరువాత వారం వారం ఉష్ణోగ్రతల్లో పెరుగుదల నమోదై ఆగస్టు మధ్యకు 2.6 డిగ్రీ సెల్సియస్‌కు చేరుకున్నట్లు డబ్ల్యూఎంఓ తెలిపింది. ఉపరితలంతోపాటు దిగువభాగంలోనూ కొన్నిచోట్ల ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎనిమిది డిగ్రీ సెల్సియస్ వరకూ ఎక్కువగా ఉండటంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితులు ఎల్‌నినో మరింత బలపడేందుకు కారణమవుతున్నాయని, 2026 ఆఖరుకు పతాక స్థాయికి చేరుతుందని వివరించింది. డబ్ల్యూఎంఓ అంచనాల ప్రకారం ఎల్‌నినోల వివరాలు నమోదు చేయడం మొదలుపెట్టిన 1950 నుంచి తీసుకున్నా ఈ ఏడాది అతి బలమైన నాలుగు ఎల్‌నినోల్లో ఒకటిగా నిలుస్తుందని హెచ్చరించింది.

**ఒక్క తీరుగా ఉండని ప్రభావం...**

ఎల్‌నినో ప్రపంచవ్యాప్తంగా వాతావరణంపై ఒకే తీరైన ప్రభావం చూపకపోవడం సమస్యను మరింత జటిలం చేస్తుంది. బలం ఆధారంగా ఏ దేశంపై ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందో కూడా చెప్పలేము. భారత దేశం విషయానికి వస్తే... చాలా సందర్భాల్లో ఎల్‌నినో తీవ్రత నైరుతి రుతుపవనాలపై వ్యతిరేక ప్రభావం చూపింది. ఎల్‌నినో సంవత్సరాల్లో తక్కువ వర్షపాతం నమోదవుతుంది. అయితే కొన్ని సంవత్సరాల్లో దీనికి భిన్నమైన పరిస్థితులూ ఏర్పడటం గమనార్హం. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే తక్కువగా ఉంటాయని భారత వాతావరణ సంస్థ ఇప్పటికే ప్రకటించింది.

ఇందుకు తగ్గట్టుగానే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణల్లోనూ చాలా చోట్ల వర్షాలు తక్కువగానే కురిశాయి. ఆగస్టు నాటికి దేశవ్యాప్తంగా వర్షాలు సాధారణం కంటే 16 శాతం తక్కువగా నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే డబ్ల్యూఎంఓ సూపర్ ఎల్‌నినో పక్కా అని, 2027 ఫిబ్రవరి వరకూ కొనసాగవచ్చునన్న ప్రకటన ఆందోళన కలిగిస్తోంది. దీనర్థం... రానున్న మూడు నెలలు దేశంలో ఉపరితల ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. హిందూ మహాసముద్రంలో పరిస్థితుల్లో ఏదైనా మార్పు వస్తే ఎల్‌నినో స్థితిగతుల్లోనూ తేడాలు వచ్చే అవకాశం ఉంది. సూపర్ ఎల్ నినో కారణంగా వచ్చే ఏడాది రికార్డు స్థాయిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా.

# బీజేపీ సెక్రటేరియట్ ముట్టడి ఉద్రిక్తం

(మొదటి పేజీ తరువాయి)

తదితరులను అరెస్ట్ చేశారు. దీంతో పోలీసులు, పార్టీకార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. కొన్నిరోజుల క్రితం ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల చెల్లింపు విషయంలో విద్యార్థుల వినతిపత్రాల సమర్పణకు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్‌ను రాంచందర్‌రావు కోరారు. దీనిపై సీఎం కార్యాలయం నుంచి ఇంకా ఎలాంటి అనుమతి రాలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.15వేల కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల మందికి పైగా విద్యార్థుల నుంచి సేకరించిన సంతకాలతో కూడిన వినతిపత్రాలను ప్రభుత్వానికి సమర్పించేందుకు బీజేపీ ఆధ్వర్యంలో గురువారం చలో సెక్రటేరియట్‌కు బయలుదేరారు. సెక్రటేరియల్ మెయిన్‌గేట్ వద్దకు వారు చేరుకోగానే పోలీసులు అడ్డుకోవడంతో, అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. రాంచందర్‌రావు, ఇతరనేతలు, కార్యకర్తలను తోపులాట మధ్య పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేశారు. అరెస్టయిన సందర్భంగా రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడుతూ ఫీజు బకాయిలు ఇవ్వకపోవడం వల్ల దాదాపు 40 లక్షల మంది విద్యార్థులు ఉన్నత చదువులకు, ఉద్యోగ అవకాశాలకు దూరమయ్యారని మండిపడ్డారు. తాను ఇప్పటికే, ఈ అంశంపై రెండురోజుల నిరాహార దీక్ష చేశానని, సీఎంకు లేఖలు రాశానని గుర్తుచేశారు. విద్యార్థుల సహనం నశించడంతోనే వారి గొంతు కగా మారి నేరుగా సచివాలయానికి వెళ్లాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ఫీజు బకాయిలన్నీ విడుదల చేసేదాకా కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ రాజీలేని పోరాటాన్ని కొనసాగిస్తుందని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే సీఎం రేవంత్ రాజీనామా చేసి,గద్దె దిగాలని డీకే అరుణ డిమాండ్ చేశారు. బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఉన్న తనను పోలీసులు అమానుషంగా ఈడ్చుకుంటూ తీసుకువెళ్లి అరెస్టు చేశారని మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. ఫీజు పోరుపై బీజేపీ సచివాలయ మెరుపు ము ట్టడి అద్భుతమని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. బీజేపీ నాయకుల అరెస్ట్‌ను పార్టీ తమిళనాడు, కర్ణాటక సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. వీరేందర్ గౌడ్, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీసుభాష్ ఖండించారు.

# ఎల్లారెడ్డిపేట నూతన తహసీల్దార్‌గా ఆడెపు దివ్యజ్యోతి

**గొట్టె రవి సిరిసిల్ల సెప్టెంబర్ 03 (ప్రజాతీర్పు ప్రతినిధి) )**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల నూతన తహసీల్దార్‌గా ఆడెపు దివ్యజ్యోతి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండి పారదర్శకంగా విధులు నిర్వహిస్తానని దివ్యజ్యోతి తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భూ సంబంధిత సమస్యలు, ధరణి/భూ భారతి తదితర రెవెన్యూ అంశాలపై ప్రజలకు సత్వర సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో ఆమె సమావేశమై మండలంలోని రెవెన్యూ అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.




# బీమా చెక్కు అందజేత

- గొల్లపెల్లి మండలం లోని దమన్నపేట గ్రామం లో మృతుని కుటుంబానికి బీమా చెక్కు అందజేత

**( కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల రూరల్) సెప్టెంబర్ 03**

జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం లోని దమన్నపేట గ్రామానికి చెందిన సిలివెరి సత్యనారాయణ ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందారు అతనికి నామీని అయినా అతని కుటుంబ సభ్యులు అయినా అతని భార్య సిలివెరి స్వప్న కు రెండు లక్షల రూపాయల బీమా (ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా గ్రామీణ బ్యాంకు ) చెక్కు ను తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ నరేష్ సార్ అందజేశారు. ఈ సందర్భంగా ఫీల్డ్ ఆఫీసర్ గారు మాట్లాడుతు అర్హులైన ప్రతి ఖాతా దారుడు బీమా సదుపాయం కల్గి ఉండాలి అని అన్నారు మరియు సర్పంచ్ జానారెడ్డి గారు మాట్లాడుతూ గ్రామంలో అందరు బీమా చేసుకోవాలి అని సూచించారు ఈ కార్యక్రమం లో జిల్లా లీడ్ బ్యాంకు ఖీజ మధు సుధన్ గారు మరియు జఖీూ కౌన్సిలర్ లు వెంకటేష్.రమేష్. విజయ్.మరియు ఖూ ప్రతిమ మరియు గ్రామం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ని ఘనంగా సన్మానించిన టేకులపల్లి మండల కాంగ్రెస్ శ్రేణులు

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) సెప్టెంబర్ 03**

టేకులపల్లి :తెలంగాణ రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్‌గా రాష్ట్ర శాసనసభ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఇల్లందు నియోజకవర్గానికి విచ్చేసిన ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య ని టేకులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ , టేకులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్కినేని శ్యాంబాబు ,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఖాదర్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్, గణేష్ , టేకులపల్లి మండలంలోని వివిధ గ్రామపంచాయతీల సర్పంచులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యే కి శుభాకాంక్షలు తెలియజేశారు.



# రైతు స్థాయిలో విత్తనాలు ఉత్పత్తి చేయాలి

## కృషి విజ్ఞాన కేంద్ర సీనియర్ సైంటిస్ట్ భరత్

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) సెప్టెంబర్ 03**

టేకులపల్లి :ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ నాబార్డ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫౌండేషన్ సీడ్ విత్తన ఉత్పత్తి లో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ డాక్టర్ టి. భరత్,పిఎసిఎస్ బేతంపూడి చైర్మన్ లక్కినేని సురేందర్, సీఈఓ ప్రేమ చారి టేకులపల్లి మండలంలోని గంగాపురం, ప్రగళ్లపాడు లోని వరి ఫౌండేషన్ సీడ్( బిపిటి 5204 ) చేస్తున్న క్షేత్రాలను పరిశీలించడం జరిగింది . ఈ సందర్భంగా డాక్టర్ టి. భరత్ సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ మాట్లాడుతూ రైతు స్థాయిలో విత్తన ఉత్పత్తి చేయడం ద్వారా ఆ మండల రైతులకు నాణ్యమైన విత్తనం అందించడానికి అవకాశం ఉంది కావున రైతు స్థాయిలో విత్తన ఉత్పత్తి చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు ఏలూరి జానకిరాములు, తుళ్లూరి వెంకటేశ్వర్లు పాల్గొనడం జరిగింది.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి మల్లారెడ్డి తీవ్ర ధ్వజమెత్తారు

## ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేశారని ఆరోపణ

**(వినోద్, ప్రజా తీర్పు, ?కీసర, మేడ్చల్) సెప్టెంబర్ 03**



ఎన్నికల సమయంలో నెరవేర్చలేని హామీలిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేసిందని మేడ్చల్ శాసనసభ్యులు, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని కీసర తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్నా ప్రాంగణానికి బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో కీసర తహసీల్దార్ కార్యాలయ పరిసరాలు హోరెత్తాయి. 'రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్', 'వద్దురా నాయనా ఈ కాంగ్రెస్ పాలన' అంటూ గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

?ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. "గత బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచి ధనిక రాష్ట్రంగా రూపుదిద్దుకుంది. కానీ, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన దార్శనికత లేని నిర్ణయాలతో రాష్ట్రాన్ని తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేసింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీలు, 420 హామీల పేరుతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్, గద్దెనెక్కిన తర్వాత ఆ హామీలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు.

?పాలనను గాలికి వదిలేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏకంగా 77 సార్లు ఢిల్లీ పర్యటనలకే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. నిషేధిత భూముల 22ఏ (22ఏ) అంశాన్ని తెరపైకి తెచ్చి సామాన్య ప్రజలను, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

?కాంగ్రెస్ రాక్షస పాలనపై ప్రజలు తీవ్ర విసుగు చెందారని, రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతి పథంలో నడిపించేందుకు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. ?ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేష్, మాజీ చైర్పర్సన్ ప్రణిత శ్రీకాంత్ గౌడ్, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు శ్రీకాంత్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సాయినాథ్, ప్రభాకర్ రెడ్డిలతో పాటు మండలం, మున్సిపాలిటీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, శ్రీధర్, తిరుపతి రెడ్డి, వివిధ గ్రామాల మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, వార్డు సభ్యులు మరియు పార్టీ శ్రేణులు భారీగా పాల్గొన్నారు.




# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ రైతు సమరశంఖం

**పిట్లం, సెప్టెంబర్ 3 (ప్రజా తీర్పు):**

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా పిట్లం మండల కేంద్రంలో రెండో రోజు రైతు సదస్సు నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదేశాల మేరకు జుక్కల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. యూరియా కోసం పడుతున్న ఇబ్బందులు, సాగునీటి కొరత, వ్యవసాయ రంగంలో నెలకొన్న సమస్యలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి రైతులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు, సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయానికి ప్రోత్సాహం వంటి కార్యక్రమాలతో రైతులకు భరోసా కల్పించారని పలువురు పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని కోరారు. "రైతుల సమస్యలు పరిష్కరించాలి.. ఇచ్చిన హామీలు అమలు చేయాలి.. రైతులకు న్యాయం చేయాలి" అంటూ సదస్సులో నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గణేష్ విగ్రహాల తరలింపునకు విద్యుత్ లైన్ల ఎత్తు పెంపు పనులు ప్రారంభం

**కోరుట్ల సెప్టెంబర్ 03 (ప్రజాతీర్పు)**



గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేష్ విగ్రహాల తరలింపునకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. గురువారం గణేష్ విగ్రహాలను షెడ్ల నుంచి తరలించే మార్గాన్ని ఎస్ఈ గారు, డీఈ (ఎంటీపీఎల్), డీఈ (జగిత్యాల ఆపరేషన్), ఏడీఈ కోరుట్ల, ఏడీఈ కోరుట్ల రూరల్, ఏఈ కోరుట్ల టౌన్–2 అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కోరుట్ల టౌన్–2 సెక్షన్ పరిధిలోని గాంధీ రోడ్డులో 11 కేవీ, ఎల్‌టీ విద్యుత్ లైన్ల ఎత్తు పెంచే పనులను అధికారులు ప్రారంభించారు. గణేష్ విగ్రహాలు సురక్షితంగా, సాఫీగా తరలించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు




## 'చలో హైదరాబాద్' మహాధర్నాను జయప్రదం చేయాలి

**కోరుట్ల సెప్టెంబర్ 03 (ప్రజాతీర్పు)**

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, ప్రభుత్వ హామీల సాధన కోసం తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' ఉద్యోగుల హక్కుల సాధన సభను విజయవంతం చేయాలని ఎస్టీయూ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెపు శివరామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం కోరుట్ల మండలంలో నిర్వహించిన ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మెరుగైన ఫిట్‌మెంట్‌తో 2వ పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్ బిల్లులను నెలకు కనీసం రూ. 2,000 కోట్ల చొప్పున చెల్లించాలని కోరారు. అలాగే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (ఖూూ)ను పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ూూూ)ను పునరుద్ధరించాలని, ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఛీజుూూ)ను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని శివరామకృష్ణ పిలుపునిచ్చారు. ఇట్టి కార్యక్రమంలో ఎస్టీయూ కోరుట్ల మండల శాఖ అధ్యక్షుడు సిరిపురం రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రవూఫ్, జిల్లా కార్యదర్శి పరందాం తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ బరిలో రేచిని విద్యార్థిని అస్విత

**(రాంపెల్లి చంద్రశేఖర్, ప్రజాతీర్పు - తాండూర్ మండలం రిపోర్టర్) సెప్టెంబర్ 3**



తాండూర్: రేచిని పీఎం శ్రీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని దేవా అస్విత రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 1న ఆసిఫాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు నిజామాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో అస్విత పాల్గొననుంది. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోసాడే ప్రదీప్, పీఈటీ సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానికులు అస్వితను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచి పాఠశాలకు, తాండూర్ మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# SGT యూనియన్ పెద్దకొడప్‌గల్ మండల అధ్యక్షుడిగా తిప్పని మారుతి

**పెద్దకొడప్‌గల్, సెప్టెంబర్ 3 ( ప్రజా తీర్పు ):**

పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం ూ+ు యూనియన్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యాల సంతోష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా తిప్పని మారుతి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షుడిగా ఎల్పుగొండ బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా సీనుగారి నరేష్, ఉపాధ్యక్షుడిగా వాగ్మారె బాలాజీ, కోశాధికారిగా కొరంపల్లి నవీన్, మహిళా అధ్యక్షురాలిగా స్వర్ణబాయి, మహిళా కార్యదర్శిగా సరిత, సాంకేతిక కార్యదర్శిగా కొయ్యడ శ్రీకాంత్, మండల కార్యదర్శిగా ఎర్రోళ్ల బాల్‌రాజ్, జాయింట్ సెక్రటరీలుగా హనుమండ్లు, బిక్షపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మహమ్మద్ చీమన్, సలహాదారుగా కళ్యాణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యాల సంతోష్ మాట్లాడుతూ ూ+ు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ూ+ులకు టీచర్స్ మీూ ఓటు హక్కు కల్పించడం, +ూ–25, +ూ–317 రద్దు కోసం పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ూ+ు ఉపాధ్యాయులంతా ఐక్యంగా ఉండి తమ సమస్యలను గుర్తించి పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ూ+ు ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# అవినీతి అభివృద్ధిపై అసెంబ్లీలో తేల్చుకుందాం రండి..

- బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావు మంత్రి అడ్లూరి సవాల్..
- ఉనికి కాపాడుకోవడానికి బీఆర్ఎస్ ప్రయత్నం..
- వెయ్యి రోజుల ప్రోగ్రెస్ రిపోర్ట్ కొప్పుల ఈశ్వర్ కి పంపిస్తా..
- ప్రోగ్రెస్ రిపోర్టులో తప్పులుంటే దేనికైనా సిద్ధం..
- విలేకరుల సమావేశంలో మంత్రి లక్ష్మణ్ కుమార్..

**( కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) సెప్టెంబర్ 03**

వెయ్యి రోజుల ప్రజాపాలన ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై, బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న అవినీతి ఆరోపణలపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను తీసుకురావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ సవాల్ విసిరారు. జగిత్యాల జిల్లా ధర్మపురి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి అడ్లూరి గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ 2023 డిసెంబర్ లో రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకొని ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. వెయ్యి రోజులుగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలతో పాటు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ యాస భాషతో ప్రభుత్వం పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పార్లమెంటులో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీని ఏక వచనంతో సంబోధించడం కేటీఆర్ హరీష్ రావుల అహంకారానికి నిదర్శనమని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న టీఆర్ఎస్, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతూ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలో నాలుగు గ్యారంటీలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. మరో రెండు గ్యారెంటీలను అమలు చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఉచిత విద్యుత్తు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతోపాటు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో పేపర్ లీకేజీలు, నోటిఫికేషన్లకే పరిమితమైన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 50వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని మంత్రి తెలిపారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుద్యోగులతో పాటు ధర్మపురి దేవుడికి సైతం శఠగోపం పెట్టారని మంత్రి గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వంలో బాసర నుంచి భద్రాచలం వరకు అన్ని ఆలయాలను అభివృద్ధి చేయడంతో పాటు వేములవాడ కొండగట్టు పుణ్యక్షేత్రాలను ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు అభివృద్ధి చేస్తున్నరని మంత్రి గుర్తు చేశారు.

**మాజీ మంత్రి కొప్పులకు వెయ్యి రోజుల ప్రోగ్రెస్ రిపోర్ట్..**

2023 డిసెంబర్ లో జరిగిన ఎన్నికల్లో ధర్మపురి ప్రజలు తనకు పట్టం కట్టారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ధర్మపురి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. మంత్రిగా పనిచేసిన కొప్పుల ఈశ్వర్ ఏనాడు ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. ధర్మపురి నియోజకవర్గ వెయ్యి రోజుల ప్రోగ్రెస్ రిపోర్ట్ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కి పంపిస్తున్నారని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. తాను పంపిస్తున్న ప్రోగ్రెస్ రిపోర్టులో ఎలాంటి తప్పులు ఉన్న దేనికైనా సిద్ధమేనని మంత్రి



అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఎల్లంపల్లి భూ నిర్వాసితుల పక్షాన నిలిచి రూ. 17 కోట్లు ప్రభుత్వం ద్వారా విడుదల చేయించానని మంత్రి తెలిపారు. ధర్మపురి లో డిగ్రీ కళాశాల అనుమతి తీసుకురావడంతో పాటు కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం జరిగిందని ఈ ఏడాది అడ్మిషన్లు ప్రారంభమై విద్యార్థులకు డిగ్రీ కళాశాల అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ధర్మారం మండలం లో ఐటిఐ ఏర్పాటు చేస్తున్నామని రూ. 10 కోట్లతో ధర్మపురి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించడం జరిగిందని మంత్రి తెలిపారు. ధర్మపురిలో గోదావరి నది కలుషితం కాకుండా రూ. 17 కోట్లతో సివరేజ్ ప్లాంట్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించడం జరిగిందని మంత్రి అడ్లూరి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మధ్యలోనే నిలిచిపోయిన రోళ్ళ వాగు ప్రాజెక్టు పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని అక్కపల్లి లిఫ్ట్ పనులు పూర్తి చేసి నియోజకవర్గంలోని రైతులకు సాగునీటిని అందిస్తామని మంత్రి తెలిపారు. పత్తిపాక రిజర్వాయర్ పనులు ప్రారంభించి ధర్మపురి నియోజకవర్గంలోని రైతులకు శాశ్వత సాగునీటి పరిష్కారం సూచిస్తామని మంత్రి తెలిపారు. గొల్లపల్లి మండలంలోని రంగధాముని పల్లి చెరువు పూడికతీత పనులు చేయడంతో పాటు యశ్వంతరావుపేట చెరువును అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. ధర్మపురిలో నైట్ కళాశాల ప్రారంభించడంతో పాటు నేరెళ్లలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో వివిధ నిధుల ద్వారా రూ. 141 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి వివరించారు. ధర్మపురిలో ప్రజలకు అందుబాటులో ఉంటు ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ధర్మపురిలో శాశ్వత త్రాగునీటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఇందులో భాగంగా అమృత పథకం ద్వారా రెండు నూతన నీళ్ల ట్యాంకులను నిర్మించినట్లు మంత్రి తెలిపారు. ధర్మపురి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రెవెన్యూ డివిజన్ సాధించడంతో పాటు బస్ డిపో ఏర్పాటు చేస్తామని అదేవిధంగా సబ్ ట్రెజరీ కార్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి వివరించారు. కొప్పుల ఈశ్వర్ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఏనాడు సంక్షేమ శాఖను పట్టించుకోలేదని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో పెండింగ్ లో ఉన్న బిల్లుల చెల్లించడంతో పాటు విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. కొప్పుల మంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గంలోని 411 కుల సంఘాల భవనాలకు ప్రొసీడింగ్స్ ఇచ్చి చేతులు దులుపుకున్నారని మంత్రి ఆరోపించారు. తాను ధర్మపురి ఎమ్మెల్యేగా గెలిచిన నాటినుండి కుల సంఘాల భవనాలకు నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో పనిచేస్తున్న పోలీసు అధికారుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాజీ మంత్రి కొప్పుల మాట్లాడుతున్నారని మంత్రి మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వందలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేశారని తనపై సైతం 17 కేసులు నమోదు చేయడంతో పాటు పలు సందర్భాల్లో గతంలో పని చేసిన పోలీసులు మ్యాన్ హ్యాండిలింగ్ చేశారని మంత్రి గుర్తు చేశారు. కొప్పుల ఈశ్వర్ పోలీసులను బెదిరించే ఆలోచన మానుకోవాలని మంత్రి అడ్లూరి అన్నారు. రెండేళ్లుగా ధర్మపురి నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల పై ఒక్క అక్రమ కేసు నమోదు కాలేదని మంత్రి వివరించారు. బీఆర్ఎస్ పార్టీ ఉనికి కాపాడుకోవడానికి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తుందని రానున్న రోజుల్లో రెండవసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు రెండవసారి ముఖ్యమంత్రి అవుతారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, బుగ్గారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సాగౌడ్, వెల్గటూర్ మండల పార్టీ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, పెగడపల్లి మండల పార్టీ అధ్యక్షుడు తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుంట సుధాకర్, నాయకులు వేముల రాజుతో పాటు ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి: మంత్రి సీతక్క

**ములుగు, సెప్టెంబర్ 3(ప్రజా తీర్పు ప్రతినిధి. వెంకట్):**

ఏటూరునాగారం: విద్యార్థినులు పట్టుదలతో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదిగి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని రాష్ట్ర మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఏటూరునాగారం గిరిజన సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలను మంత్రి సందర్శించి విద్యార్థినులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల విద్యాభ్యాసం, వసతులు, ఎదుర్కొంటున్న సమస్యలు, కళాశాలలో అందుతున్న సౌకర్యాలపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతిగృహ జీవితం విద్యార్థినుల్లో ఐక్యత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని అన్నారు. విద్యార్థినులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కష్టపడి చదవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని, కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సాధారణ విజ్ఞానాన్ని పెంచుకోవాలని మంత్రి సూచించారు. మొబైల్ ఫోన్లను అవసరమైన మేరకు విజ్ఞానం, విద్యాభ్యాసం కోసం మాత్రమే ఉపయోగించాలని, అనవసరమైన విషయాలకు సమయాన్ని వృథా చేయవద్దని విద్యార్థినులకు సూచించారు. ప్రతిరోజూ పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని, పుస్తకాలు మన ఆలోచనా విధానాన్ని విస్తృతం చేస్తాయని తెలిపారు. విద్యార్థినులు తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలను గుర్తుంచుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని సీతక్క అన్నారు. గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

**నూతన ఐటీడీఏ నిర్మాణ స్థల పరిశీలన**

అనంతరం ఏటూరునాగారంలో 5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న నూతన ఐటీడీఏ కార్యాలయ స్థలాన్ని మంత్రి సీతక్క పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి సంబంధించిన స్థల పరిస్థితులు, అవసరమైన మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి ప్రజలకు, గిరిజనులకు మెరుగైన పరిపాలనా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కళాశాల సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## నేరాల నియంత్రణకే సీసీ కెమెరాల ఏర్పాటు

- ముఖ్య అతిథులుగా హాజరైన శేరిలింగంపల్లి జోన్ డీసీపీ సిహెచ్ శ్రీనివాస్ ఐపిఎస్,ఏసీపీ శ్రీనివాస్

**పటాన్ చేరు, సెప్టెంబరు 3 ప్రజాతీర్పు ప్రతినిధి**

ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్‌లో శేరిలింగంపల్లి జోన్ డీసీపీ సిహెచ్ శ్రీనివాస్ ఐపిఎస్ చేతుల మీదుగా సీసీటీవీ కెమెరాల ప్రారంభోత్సవం చేసారు.బొల్లారం సీఐ సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చెసిన 100 సీసీటీవీ కెమెరాలను శేరిలింగంపల్లి జోన్ డీసీపీ సిహెచ్ శ్రీనివాస్ ఐపిఎస్, రామచంద్రపురం ఏసీపీ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్బంగా డీసీపీ సిహెచ్ శ్రీనివాస్ ఐపిఎస్ మాట్లాడుతూ ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, నిందితులను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని అన్నారు.రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల కేసుల మిస్టరీ ఛేదించడంలో కెమెరాల పాత్ర ఉన్నది. కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా లాభాలను ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఆయా పరిసరాలలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో కెమెరాలను ఏర్పాటు చేయడంతో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. ఈ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు కోసం సహకరించిన ఖాజిపల్లి మున్సిపల్ చైర్మన్,ఎన్వీఆర్ పాఠశాల, జాయ్ ఇంటర్నేషనల్ పాఠశాల, పిబిఆర్ హాస్పిటల్, హెడ్ క్వార్టర్ రెస్టారెంట్,మైత్రి కన్స్ట్రక్షన్స్, ఐటీసీ పరిశ్రమ, జెనెఎక్స్ పరిశ్రమ ఆర్ఆర్ కె హబ్ వారికి పోలీస్ సిబ్బంది చిరు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఖాజిపల్లి సీనియర్ నాయకులు గద్దె నర్సింహా,ఎస్ఐ అక్షిత, బొల్లారం ఇండస్ట్రీస్ అధ్యక్షులు ఆనంద్ రావ్, బొల్లారం ఇండస్ట్రీస్ ప్రధాన కార్యదర్శి రాయుడు,జాయ్ స్కూల్ యాజమాన్యం ప్రసాద్ రెడ్డి, సతీష్, ఎన్వీఆర్ స్కూల్ యాజమాన్యం వెంకట్రావు, మైత్రి కన్స్ట్రక్షన్ కొండల్ రెడ్డి, హెడ్ క్వార్టర్ హోటల్ యాజమాన్యం శ్రీకాంత్ రెడ్డి, తిరుపతి రెడ్డి,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు

**కోరుట్ల సెప్టెంబర్ 03 (ప్రజాతీర్పు)**

పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు బిర్యానీ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు, స్వీట్ హౌస్‌లలో తనిఖీలు చేపట్టి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులకు మొత్తం రూ.30 వేల జరిమానా విధించడంతో పాటు ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించారు.ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోని దుకాణదారులకు వెంటనే లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కమిషనర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలతో పాటు దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ట్రేడ్ లైసెన్స్ లేని వ్యాపారులు వెంటనే లైసెన్స్ పొందాలని సూచించారు.వ్యాపార కార్యకలాపాల ద్వారా వెలువడే చెత్తను తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని తెలిపారు. నిబంధనలు పాటించకపోతే ఎస్‌డబ్ల్యూఎం-2026 నిబంధనల ప్రకారం జరిమానాలు విధిస్తామని పేర్కొన్నారు.ఈ తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, రికార్డ్ అసిస్టెంట్ జగదీష్, వార్డ్ ఆఫీసర్లు వెంకటేష్, రాజుతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




## బీజేపీ జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో సాయిని మల్లేశం కు ఘన సన్మానం

**(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) సెప్టెంబర్ 03**

కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షులుగా సాయిని మల్లేశం నియమితులైన అనంతరం గురువారం మొదటిసారిగా కరీంనగర్ కోర్టుకు విచ్చేసిన నేపథ్యంలో బీజేపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు ఆత్మీయ స్వాగతం పలికి, ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రపాటి కిరణ్ కుమార్ శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ న్యాయవాది అలాగే హుస్నాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా భాద్యతలు నిర్వహిస్తున్న, మల్లేశం కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షులుగా నియామకమైన తర్వాత మొదటిసారిగా కరీంనగర్ కోర్టుకు హాజరైన సందర్బంగా లీగల్ సెల్ న్యాయవాదులతో పాటుగా సహచర న్యాయవాదులు, సీనియర్ న్యాయవాదులు ఆత్మీయంగా పలకరించి అభినందనలు తెలిపారు. సీనియర్ న్యాయవాదులు గౌతమ్ రెడ్డి కూర శ్రీనివాస్ రెడ్డి, బీవి రమణ గుజ్జ సతీష్ లీగల్ సెల్ న్యాయవాదులు కటకం శ్రవణ్ కుమార్ కొలిపాక చంద్రమౌళి సుగుర్తి జగదీశ్వరాచారి వెన్న ఆనంద్ ముద్దసాని సంపత్ ఉషకోయిల రమేష్ గుంజెటి శివ ముత్తునూరి హరీష్ రావు బండారి గాయత్రి దీరజ్ సాయి చరణ్ వినయ్ తదితరులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసన

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) సెప్టెంబర్ 03**

టేకులపల్లి:లి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఆ పాలనకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో టేకులపల్లి మండల కేంద్రంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు.ఈ నిరసన కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాకేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇల్లందు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం నుంచి బోడు రోడ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని, ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.అనంతరం బోడు రోడ్ సెంటర్ లో రైతు సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో రాకేష్ రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ హయాంలో వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు.రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంటు, కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతులకు అండగా నిలిచారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేశారని, ఇప్పటికీ చాలా మందికి రుణమాఫీ కాలేదని ఆరోపించారు. మాజీ



ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని అన్నారు. కెసిఆర్ హయాంలోనే తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని గుర్తు చేశారు. దళితబంధు, గిరిజన బంధు, కళ్యాణ లక్ష్మి వంటి పథకాలు బీఆర్ఎస్ హయాంలోనే అమలయ్యాయని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేసిందని మండిపడ్డారు.మహిళలకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేరలేదని విమర్శించారు. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పాలనలో కరెంటు కోతలు, సాగునీటి కొరతతో రైతులు అల్లాడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ రైతుల పక్షాన ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం నిరసనకు చిహ్నంగా వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు.రోడ్డుపై వంట చేసి ప్రభుత్వ తీరుకు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు పాల్గొన్నారు. మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, రైతుబంధు సమితి నాయకులు హాజరయ్యారు.బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళా విభాగం నాయకులు, యువజన విభాగం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక రైతులు కూడా ఈ ధర్నాకు మద్దతు తెలిపారు.ప్రజా సమస్యలపై పోరాటం ఆగదని, బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలుస్తుందని నాయకులు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే తమ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో భవిష్యత్తులో మరింత ఉధృతంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ

- ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలి: సర్పంచ్ ఆకుల వెంకటేష్

**(రాంపెల్లి చంద్రశేఖర్, ప్రజాతీర్పు - తాండూర్ మండలం రిపోర్టర్) సెప్టెంబర్ 03**

తాండూర్ : తాండూర్ మండలంలోని రేపల్లెవాడ, పెగడపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత యూనిఫామ్స్‌ను గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. కొత్తపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ఆకుల వెంకటేష్ విద్యార్థులకు యూనిఫామ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యలో ఉన్నతంగా రాణించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొల్లూరు సంగీత ప్రకాష్, వార్డు సభ్యులు జంబోజుల ప్రవీణ్, ఏసమ్ శేఖర్, చొప్పదండి రాజేశ్వరి, దుర్గం శ్రీలత, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మేడిపల్లి లో ఘనంగా కాంగ్రెస్ విజయోత్సవ బైక్ ర్యాలీ

- ఉప్పల్ డిపో వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం.
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్.
- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ.

**మేడిపల్లి, సెప్టెంబర్ 3. ( ప్రజాతీర్పు )**



మేడిపల్లి:కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పరిపాలన విజయవంతంగా కొనసాగుతున్న సందర్భంగా మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ మేడిపల్లిలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు. సాయి ప్రియ కాలనీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ఎమ్మార్వో ఆఫీస్ నుండి ఉప్పల్ డిపో వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. అనంతరం ఉప్పల్ డిపో వద్ద బోడుప్పల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 50 అడుగుల భారీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో కెసిఆర్ చేసిన అప్పుల ఊబి నుండి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తూ, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తెల్ల రేషన్ కార్డుల పంపిణీ, కొత్త పెన్షన్లు వంటి అనేక సంక్షేమ ఫలాలను అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలకు రికార్డింగ్ డాన్స్ వేసి చూపించడం తప్ప ప్రజలకు మల్లారెడ్డి చేసింది ఏమీ లేదని, చిత్తశుద్ధి ఉంటే మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం బహిరంగ చర్చకు సిద్ధమని ఉద్దేశం యాదవ్ సవాల్ విసిరారు. అనంతరం తుంగతుర్తి రవి మాట్లాడుతూ అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రెస్ గా మారిన కేసీఆర్ ప్రభుత్వం, బి ఆర్ ఎస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని, పదేళ్ల తమ పాలనలో పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, దోచుకోవడం, దాచుకోవడం తప్ప బిఆర్ఎస్ నేతలు ప్రజా సమస్యలను పట్టించుకోలేదని తుంగతుర్తి మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అజయ్ యాదవ్,డీసీసీ ప్రధాన కార్యదర్శి జలెందర్ రెడ్డి,బోడుప్పల్ సర్కిల్ డివిజన్ అధ్యక్షులు బండి శ్రీరాములు, బొమ్మక్ కళ్యాణ్, పోగుల దిలీప్ రెడ్డి,వంగేటి ప్రభాకర్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,జిల్లా నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు, డివిజన్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, మహిళా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి లాంగ్‌జంప్‌లో టేకులపల్లి విద్యార్థికి ద్వితీయ స్థానం

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) సెప్టెంబర్ 03**



టేకులపల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాల టేకులపల్లికి చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థి కాలం దిలీప్ కుమార్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటాడు. తెలంగాణ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొన్న దిలీప్ కుమార్ లాంగ్‌జంప్ విభాగంలో ద్వితీయ స్థానాన్ని సాధించి కళాశాలకు, టేకులపల్లి మండలానికి పేరు తీసుకొచ్చాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం. పవన్ కుమార్తో పాటు అధ్యాపకులు దిలీప్ కుమార్‌ను అభినందించారు. క్రీడల్లో మరింతగా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బసవమ్మ, సత్యవతి, ముంతాజ్, బాబురావు, అలీ, శంకర్రావు, వేణుగోపాల్, శ్రీనివాసరావు, యాకూబ్, వరలక్ష్మి, ప్రమోద్ కుమార్, సంజీవరెడ్డి, అధ్యాపకేతర సిబ్బంది బిక్షం, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా జిల్లా అభివృద్ధి

- సీతారామ ప్రాజెక్టుతో పాటు నిర్వాసితుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్న పాలకులు
- స్థానిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యం
- విద్య వైద్యం పై దృష్టి సారించని ప్రజాప్రతినిధులు
- సిపిఐఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు
- జిల్లా పూర్తి కాలం కార్యకర్తల విస్తృత సమావేశం




**(భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,భూక్య సందీప్,ప్రజాతీర్పు ప్రతినిధి) సెప్టెంబర్ 03**

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి ఉందని సిపిఐఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు ఆరోపించారు. స్థానిక సమస్యల పరిష్కారంలో పాలకులు పూర్తిగా వైఫల్యం చెందారని మచ్చ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పూర్తి కార్యకర్తల సమావేశానికి మచ్చ వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. గ్రామాల నుండి పట్టణాల వరకు పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని ఆ ఫలితంగానే భద్రాచలం నుండి వాజేడు వరకు జాతీయ రహదారి పూర్తిగా ధ్వంసం అయిపోయిన నేటికీ పునర్నిర్మాణ పనులు చేపట్టడం లేదని అన్నారు. ఏజెన్సీ ఖనిజ సంపద అయిన ఇసుకను దోచుకుంటున్న పాలకులు దానివల్ల జరిగే నష్ట నివారణకు మాత్రం చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమని అన్నారు.

### సీతారామ ప్రాజెక్టు తో పాటు నిర్వాసితుల సమస్య నిర్లక్ష్యం....

సీతారామ ప్రాజెక్ట్ పూర్తిచేసి జిల్లాకు నిర్వహించాల్సి ఉండగా నిర్మాణంలో సర్కార్ పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని మచ్చ ఆరోపించారు. జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్న మంత్రుల మాటలు నీటి మూటలుగా మారాయని నేటికీ సీతారామ ప్రాజెక్టు ఫలాలు జిల్లా ప్రజలకు అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్టు వల్ల నష్టపోయిన నిర్వాసితులకు రైతులకు ముగ్గురు మంత్రులు ఉన్న నేటికీ న్యాయం జరగలేదని అన్నారు. హడావుడిగా మంత్రులు ప్రాజెక్టు సందర్శించి ఉపన్యాసాలు చెప్పటమే తప్ప నిర్వాసితుల గోడు పట్టించుకోవడంలేదని అన్నారు. సిపిఐ ఎం బృందం ప్రాజెక్ట్ సందర్శన సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణంలో జరుగుతున్న నిర్లక్ష్యం తోపాటు నిర్వాసితులు తమ సమస్యను సిపిఐ ఎం బృందం దృష్టికి తీసుకువచ్చారని అన్నారు.సీతారామ ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయకపోతే ముగ్గురు మంత్రులకు జిల్లా ప్రజలు తగిన బుద్ధి చెబుతారని మచ్చ హెచ్చరించారు.

### విద్యా వైద్యంపై ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్య వైద్యం పై ప్రజాప్రతినిధులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆ ఫలితంగానే పేదవాడికి ప్రభుత్వ విద్య అధునాతన వైద్యం అందరిని ద్రాక్షలా మారుతుందని మచ్చ అన్నారు. గత నెలలో సిపిఐఎం ప్రజా సంఘాలు జిల్లా వ్యాప్తంగా విద్యా వైద్యంపై పూర్తిస్థాయిలో సర్వేలు నిర్వహించారని ఆయన గుర్తు చేశారు. సర్వేల సందర్భంగా పిహెచ్సిలో వైద్యుల మందుల కొరతతో పాటు భద్రాచలం కొత్తగూడెం మణుగూరు ఇల్లందు ఏరియా ఆసుపత్రిలో సైతం సిబ్బంది కొరతతో పేదవాడికి వైద్యం అందటం లేదని అన్నారు. ప్రభుత్వ ఆశ్రమ సాంఘిక పాఠశాలలలో భవనాలు శిథిలవస్థకు చేరి కూలిపోయే పరిస్థితిలో ఉన్న నిధులు కేటాయించడం లేదని అన్నారు. ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు అనేక రకాల సమస్యలు వెంటాడుతున్నాయని సమస్యలు వలయంలోనే విద్య అభ్యసించాల్సిన పరిస్థితి నెలకొంటుందని మచ్చ ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాచలం ప్రభుత్వ ఏరియాస్పత్రిని సిపిఐ ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రత్యక్షంగా సందర్శించి సమస్యలపై ముఖ్యమంత్రికి లేఖను సైతం రాశారని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పై పాలకులు చూపిస్తున్న నిర్లక్ష్యం వీడకుంటే కలిసి వచ్చే శక్తులతో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని మచ్చ హెచ్చరించారు. సర్ పేరుతో అర్హత ఉన్న ఓటర్లను తొలగించే కుట్రలు కేంద్ర ప్రభుత్వం చేస్తుందని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించాల్సిన అవసరం ఉందని మచ్చా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు సున్నం గంగ చర్ల మండల కార్యదర్శి మచ్చ రామారావు పాల్వంచ పట్టణ కార్యదర్శి తులసీరామ్ బూర్గంపాడు మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు నాయకులు కే సత్య వాణి ఎస్ లక్ష్మి మధు కత్రాల తిరుపతిరావు తాలూరి కృష్ణ రవీందర్ తదితరులు పాల్గొన్నారు



## భద్రాచలం భగవాన్‌దాస్ కాలనీలో భక్తిశ్రద్ధలతో కర్ర పూజ

**(భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భూక్య సందీప్, ప్రజాతీర్పు ప్రతినిధి,) సెప్టెంబర్ 03**

భద్రాచలం పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీలో శ్రీ విఘ్నేశ్వర గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కర్ర పూజ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గణనాథుని ఉత్సవాలకు శ్రీకారం చుడుతూ నిర్వహించిన ఈ పూజా కార్యక్రమానికి కాలనీ వాసులతో పాటు పట్టణంలోని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కర్ర పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు గణపతిని స్మరిస్తూ ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం సందర్భంగా కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గణనాథుని నామస్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. గణేష్ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు, కాలనీ వాసులు సమష్టిగా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పులపాటి నాగేశ్వరరావు, కుంజ ధర్మా, సున్నం భూలక్ష్మి, శుభలక్ష్మి, రామకృష్ణ, రాంబాబు, హరి, కుంజ సంతోష్, సాయి కౌశిక్, రాజా, మణి, నిర్మల, మాధవి ,నాగేశ్వర రావు, సందీప్, బుబమ్మ, శ్రీదేవి, శ్రీను, ఝాన్సీ, గౌరి, భాస్కర్ రావు, విష్ణు, , నందిని, లక్ష్మీ, సునీత, తదితరులు పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీపై కేసును వెంటనే ఉపసంహరించుకోవాలి

- కాంగ్రెస్ నేతలు

**కోరుట్ల, సెప్టెంబర్ 3 (ప్రజాతీర్పు)**

రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్ పోలీసులు నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కోరుట్ల పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కొత్త బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు ముఖ్య అతిథులుగా హాజరై ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వా జిల్లాలో ఎస్ఐఆర్‌పై నిర్వహించిన కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పాల్గొని ప్రసంగించిన అనంతరం సభా ప్రాంగణాన్ని బీజేపీ నేతలు గంగాజలంతో శుద్ధి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దళిత నాయకుడు పాల్గొన్న సభా ప్రాంగణాన్ని గంగాజలంతో శుద్ధి చేయడం ద్వారా బీజేపీకి దళితుల పట్ల ఉన్న వైఖరి స్పష్టమవుతోందని విమర్శించారు.బీజేపీ దళితులను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తోందని ఆరోపించిన వారు.. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. ఈ అంశంపై రాహుల్ గాంధీ మాట్లాడినందుకు ఆయనపై కేసు నమోదు చేయడం సరికాదని అన్నారు.రాహుల్ గాంధీపై నమోదైన కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో బీజేపీ దళితుల పట్ల వ్యవహరిస్తున్న తీరును ప్రజల్లోకి తీసుకెళ్లి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వ కాలంలో రేషన్ కార్డుల కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డ పేదలు

- ప్రజా ప్రభుత్వంలో ఇంటింటికి స్మార్ట్ కార్డుల పంపిణీ..
- ఎండపల్లి మండలంలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తా
- ఉమ్మడి వెల్గటూర్ మండలంలో ట్రామా కేర్ సెంటర్..
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి)సెప్టెంబర్ 03:**



గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో రేషన్ కార్డుల కోసం పేద ప్రజలు దరఖాస్తులు చేసుకుని, కార్డుల మంజూరి కోసం ఎదురుచూసి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులైన వారందరికీ అందజేస్తున్నామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలో గురువారం అర్హులైన వారందరికీ ప్రభుత్వం నుండి మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ 2023లో మార్పు కోరుకొని ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో అర్హులైన వారికి స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఉమ్మడి వెల్గటూర్ మండల అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఇప్పటికే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం తో పాటు ధర్మపురిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. మండలంలో ఐటిఐ ఏర్పాటు చేస్తున్నామని, ఎండపల్లి మండలంలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఉమ్మడి వెల్గటూర్ మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి పాషిగాం గ్రామంలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలకు ధర్మపురిలో అందుబాటులో ఉంటూ బాధ్యత మర్చిపోకుండా అందరి సమస్యలు తీర్చు తున్నానని మంత్రి వివరించారు. నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న రోళ్ళ వాగు ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేసి రంగదామునిపల్లి చెరువు అభివృద్ధితో పాటు జంగల్ నాల ప్రాజెక్టు అభివృద్ధి చేసి సాగునీటిని పూర్తిస్థాయిలో అందిస్తామని మంత్రి తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ఎండపల్లి మండలంలో 9,900 రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామని, రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఎండపల్లి గ్రామానికి 33 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశామని తెలిపారు. ఎండపల్లి గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం డ్రైనేజీ నిర్మాణం తో పాటు ఎస్సీ కమిటీ హాల్ నిర్మాణం పూర్తి చేయిస్తానని, ఎండపల్లిలో ఎక్స్ ప్రెస్ బస్సు ఆపే విధంగా చర్యలు తీసుకుంటామని జూనియర్ కళాశాల ఏర్పాటు చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారం సునీత– జలంధర్ రెడ్డి, జగిత్యాల అడిషనల్ కలెక్టర్ కలెక్టర్ బి ఎస్ లత, ఆర్డిఓ మధుసూదన్, తహసిల్దార్ అనిల్ కుమార్, గిర్దావర్ తోడేటి అన్వేష్, ఎంపీడీవో కృపాకర్, ఎండపల్లి ఫ్యాక్స్ చైర్మన్ గూడ రాంరెడ్డి, ఎండపల్లి,వెల్గటూర్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గెల్లు చంద్రశేఖర్ యాదవ్, తాటిపర్తి శైలేందర్ రెడ్డి,ఆయా శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వంపై విమర్శలు మాని ప్రతిపక్ష పార్టీగా మీ బాధ్యతలు నివర్తించండి

- కాంగ్రెస్ పార్టీ కోహెడ మండల శాఖ అధ్యక్షుడు శెట్టి సుధాకర్

**(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) సెప్టెంబర్ 03**



నిరంతరం ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తూ, రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వ పై విమర్శలు మాని, భారతీయ రాష్ట్ర సమితి ప్రతిపక్ష పార్టీగా తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలని కాంగ్రెస్ పార్టీ కోహెడ మండల శాఖ అధ్యక్షుడు శెట్టి సుధాకర్ ఉద్బోధించారు .కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి గురువారం పాత బస్టాండ్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, టపాకాయలు కాల్చి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించి వాటి ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకొని ఒక్కో సమస్యను పరిష్కరించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వంది అన్నారు. ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో బాగంగా అధికారం చేపట్టిన వెంటనే రేవంత్ రెడ్డి సహకారంతో ఈ ప్రాంతం నుండి ప్రాతినిత్యం వహిస్తున్న శాసన సభ్యులు తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ మహిళలకు ఉచిత ప్రయాణం ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. అదేవిధంగా గత ప్రభుత్వంలో రైతులకు రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చి, అధికారంలోకి వచ్చాక రుణమాఫీ చేయని అసమర్థ ప్రభుత్వం బిఆర్ఎస్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రుణమాఫీ, రెండు వందల యూనిట్ల వరకు గృహానికి ఉచిత విద్యుత్,500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, త్వరలో చేయూత,వితంతు ఫించన్ కూడా నాలుగు లక్షల మంది వరకు ఇచ్చే విధంగా ఇప్పటికే ప్రక్రియ మొదలైందని అన్నారు. పది సంవత్సరాలు సతీష్ కుమార్ శాసన సభ్యులుగా ఉన్నా నియోజక వర్గానికి ఏమి చేయలేదని మీరు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గు చేటు అన్నారు.ఎన్నో ఏండ్ల కల అయిన తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పోరాటం చేసి భారత పార్లమెంటులో తెలంగాణ బిల్లును అమలు చేయడంలో తనదైన పాత్ర పోషించిన పొన్నం ప్రభాకర్ ఈ హుస్నాబాద్ ప్రాంతం నుండి శాసన సభ్యులుగా గెలుపొందిన మూడు సంవత్సరాల కాలంలోనే ఈ నియోజకవర్గాన్ని విద్యా, వైద్యం,పారిశ్రామిక, టూరిజం, క్రీడా రంగాల్లో అభివృద్ధి చేస్తున్న అభివృద్ధి ప్రదాత అని అన్నారు. అదే విధంగా కోహెడ మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో 200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపట్టిన ఘనత మా పొన్నం ప్రభాకర్ ది. మండలంలోని ప్రతి గ్రామంలో దాదాపుగా 50 లక్షల రూపాయల వరకు సీసీ రోడ్ల నిర్మాణం, పలు గ్రామాల్లో హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణం, మండలానికి గ్రామాలను అనుసంధానం చేస్తూ డబుల్ బీటీ రోడ్లు నిర్మాణం పనులను చేసిన నాయకుడు ఈ ప్రాంత బిడ్డ పొన్నం ప్రభాకర్ అని అన్నారు.గత వైఎస్సార్ ప్రభుత్వంలో గౌరవెల్లి ప్రాక్టుకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభిస్తే అధికారంలోకి వచ్చిన మీరు ఆ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తే, ప్రజా పాలన ప్రభుత్వం వచ్చిన తరువాత మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి వల్లనే ఈ ప్రాజెక్ట్ ను పూర్తి చేసి, వరద కాలువలో భూమిని కోల్పోయిన రైతాంగానికి చెక్కులు అందచేస్తూ ప్రతి ఎకరాకు నీరు అందించేందుకు ముందుకు వెళుతుందని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించడం మానుకొని ప్రతిపక్ష హోదాలో సకల సౌకర్యాలు అనుభవిస్తూ, లక్షల్లో జీతాలు తీసుకొని అసెంబ్లీకి రాకుండా విలాస వంతమైన జీవితం గడుపుతూ ప్రజల ధనాన్ని దుర్వినియోగం చేస్తున్న కెసిఆర్ ఇంటివద్ద ధర్నా,నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బిఆర్ఎస్ నాయకులను ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బందెల సుజాత బాలకిషన్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బోయిని నిర్మల జయరాజు వైస్ చైర్మన్ భూమిరెడ్డి తిరుపతిరెడ్డి, కరివేద చంద్రారెడ్డి కర్ర రవీందర్ దొమ్మాట జగన్ రెడ్డి చింతలపల్లి ప్రతాపరెడ్డి భీమ్ రెడ్డి మల్లారెడ్డి గాజుల రవీందర్ బాల్ రాజు ముంజ తిరుపతి ఆయా గ్రామ శాఖల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# బీసీఐటీలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ

## పూర్తి చేసిన విద్యార్థినులకు సర్టిఫికెట్ల పంపిణీ

**జమ్మికుంట సెప్టెంబర్ 03 ప్రజాతీర్పు**

జమ్మికుంటలోని బీసీఐటీ కార్తికేయ ఐటీఐ కళాశాలలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థినులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఆరు నెలలు, మూడు నెలల పాటు శిక్షణ పొందిన విద్యార్థినులకు ఈ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా బీసీఐటీ చైర్మన్ లెంకలపెల్లి శరత్ కుమార్ మాట్లాడుతూ.. బీసీఐటీలో శిక్షణ పొందిన ఎంతోమంది విద్యార్థినులు ప్రస్తుతం స్వయం ఉపాధి పొందడంతో పాటు వివిధ రంగాల్లో ఉద్యోగాలు చేస్తుండటం ఎంతో గర్వకారణంగా, సంతోషకరంగా ఉందన్నారు. విద్యార్థులు తమకు అందిన శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు.కుట్టుమిషన్ శిక్షణకు సంబంధించిన సర్టిఫికెట్ ద్వారా ప్రభుత్వం అందించే వివిధ రకాల రుణాలు, ఉపాధి పథకాలకు అర్హత పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థినులు తమ అర్హతలను బట్టి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం బీసీ విద్యార్థులకు కుట్టుమిషన్లు అందించే కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో, బీసీఐటీలో కుట్టుమిషన్ శిక్షణ పూర్తి చేసి సర్టిఫికెట్ పొందిన విద్యార్థులు ఆ సర్టిఫికెట్ ఆధారంగా కుట్టుమిషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని శరత్ కుమార్ తెలిపారు.అదేవిధంగా బీసీఐటీలో ఉచిత కుట్టుమిషన్ మరియు బ్యూటిషియన్ కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఉచిత శిక్షణ ద్వారా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని స్వయం ఉపాధి పొందేందుకు ఇది మంచి అవకాశమని తెలిపారు.



# జాతీయ రహదారి పరిధిలో ఉన్న పెండింగ్ పనులు పూర్తి చేయాలి

## రాష్ట్ర రవాణా బీసీ, సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ సెప్టెంబర్ 03 రవీందర్ ప్రజా తీర్పు**

హుస్నాబాద్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు ఆర్అండ్‌బీ రోడ్లకు మంజూర్లు ఇవ్వడంతో పాటు, ఇప్పటికే మంజూరైన రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో భేటీ అయిన పొన్నం ప్రభాకర్ చర్చించారు. సిద్దిపేట, టు , ఎల్కతుర్తి జాతీయ రహదారి పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రహదారిపై పెండింగ్‌లో ఉన్న కల్వర్టుల నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు మిట్టపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ పనులు పూర్తయితే వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని మంత్రి తెలిపారు.ఎల్కతుర్తి జంక్షన్ వద్ద బాటిల్‌నెక్ సమస్యను పరిష్కరించాలి ఎల్కతుర్తి జంక్షన్ వద్ద కరీంనగర్, టు, హనుమకొండ, సిద్దిపేట వైపు వెళ్లే రహదారులు కలిసే ప్రాంతంలో రోడ్డు ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ నేపథ్యంలో జంక్షన్ వద్ద రహదారిని విస్తరించి బాటిల్‌నెక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. అలాగే కరీంనగర్, టు,ఎల్కతుర్తి, ఎల్కతుర్తి, టు ,హనుమకొండ మధ్య కొనసాగుతున్న రోడ్డు పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి రోడ్డు మౌలిక వసతులు అత్యంత కీలకమని, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



**కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా బోడుప్పల్ సర్కిల్‌లో కాంగ్రెస్ నాయకుల బైక్ ర్యాలీ**

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కటౌట్‌కు డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ అజయ్ యాదవ్ పాలాభిషేకం.

**మేడిపల్లి, సెప్టెంబర్ 3. ( ప్రజాతీర్పు )**

మేడిపల్లి:మేడ్చల్ మల్కాజ్గిరి బోడుప్పల్ సర్కిల్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ బోడుప్పల్ కమాన్ వద్ద ముగిసింది.బోడుప్పల్ కమాన్ వద్ద ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కటౌట్‌కు డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పాలాభిషేకం చేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ విజయాలను వివరిస్తూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుటుంబ పాలన, గడీల పాలన కొనసాగిందని విమర్శించారు. కుమారుడు, కూతురు, అల్లుడికి పదవులు కట్టబెట్టి అధికారాన్ని కుటుంబానికే పరిమితం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ప్రాధాన్యమిస్తూ ప్రజాపాలన సాగిస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నాయకులు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి చేస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ.. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. గత పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు అండగా నిలిచారని వజ్రేష్‌యాదవ్ అన్నారు. రానున్న గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోడుప్పల్, మేడిపల్లి, పీర్జాదిగూడ, చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షులు బొమ్మ కళ్యాణ్, తుంగతుర్తి రవి , బండి శ్రీరాములు, పోగుల దిలీప్ రెడ్డి తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పాఠశాల విద్యార్థులకు ఉచిత యూనిఫాంల పంపిణీ

**జుక్కల్, సెప్టెంబర్ 03, ( ప్రజా తీర్పు )**

తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా మద్నూర్ మండలం పెద్ద ఎక్లరా గ్రామ స్థానిక ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థులకు గ్రామ సర్పంచ్ మహేష్ ఉపసర్పంచ్ సంగ్రామ్ పటేల్ చేతుల మీదుగా గురువారం యూనిఫారాలు పంపిణీ చేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ...ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తూ విద్యార్థులకు కావలసిన అన్ని వసతులను కల్పిస్తోంది. సకాలంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందించడం వల్ల పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. విద్యార్థులందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి" అని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం వున్నారు.

# తెలంగాణ ప్రజల సమస్యలు కనిపించవు.. ఉత్తరాఖండ్ ఎఫ్ఐఆర్ మాత్రం గుర్తొచ్చిందా?

- కాంగ్రెస్‌కు నిరసనలపై ఉన్న శ్రద్ధ.. ఆరు గ్యారంటీల అమలుపై ఎందుకు లేదు?
- బీజేపీ నాయకుడు పెండెం గణేష్ ధ్వజం

**కోరుట్ల, సెప్టెంబర్ 3 (ప్రజాతీర్పు)**



తెలంగాణలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కనపెట్టి, ఇతర రాష్ట్రాల్లో నమోదైన కేసులపై కాంగ్రెస్ పార్టీ నిరసనలు చేయడం విడ్డూరంగా ఉందని బీజేపీ నియోజకవర్గ నాయకుడు పెండెం గణేష్ తీవ్రంగా విమర్శించారు.రాహుల్ గాంధీపై నమోదైన ఎఫ్ఐఆర్ విషయంలో ఆందోళన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, ఆ కేసు ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఉత్తరాఖండ్ పోలీసులు నమోదు చేసిన విషయాన్ని ముందుగా తెలుసుకోవాలని సూచించారు. పోలీసుల ఎఫ్ఐఆర్‌ను కూడా బీజేపీ ఖాతాలో వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు."ఇక్కడ ఆరు గ్యారంటీలు ఎక్కడ? అక్కడి ఎఫ్ఐఆర్‌పై ఇంత హడావుడి ఎందుకు?" అని గణేష్ ప్రశ్నించారు.తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రజలకు ఉద్యోగాలు, అభివృద్ధి, సంక్షేమం, హామీల అమలు వంటి అంశాలపై సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, ఇతర రాష్ట్రాల్లోని రాజకీయ అంశాలపై నిరసనలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. "ఇక్కడి సమస్యలు పట్టించుకోరు.. అక్కడి ఎఫ్ఐఆర్‌కు ధర్నాలు చేస్తారా?" అని మండిపడ్డారు.ప్రత్యర్థి పార్టీ కార్యాలయాలపై దాడులు, రౌడీయిజం ఎవరు చేసినా ఖండించాల్సిందేనని, ప్రజాస్వామ్యం అంటే కేవలం నిరసనలు చేయడం మాత్రమే కాదని, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించడం కూడా ప్రజాస్వామ్య బాధ్యతేనని అన్నారు.అమెరికా వీసా వ్యవహారంపై కూడా ఆధారాలు ఉంటే ప్రజల ముందుంచాలని, ఊహాగానాలను రాజకీయ ప్రచారానికి ఉపయోగించవద్దని సూచించారు. ప్రజలకు కావాల్సింది బ్యానర్లు, నినాదాలు, ఫొటో రాజకీయాలు కాదని.. పాలన, అభివృద్ధి, హామీల అమలు, బాధ్యత కావాలని గణేష్ పేర్కొన్నారు."ముందు తెలంగాణ ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పండి.. తర్వాత ఉత్తరాఖండ్ గురించి మాట్లాడండి" అని కాంగ్రెస్ నాయకులను పెండెం గణేష్ ప్రశ్నించారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన

- వెయ్యి రోజులుగా ఫామ్ హౌస్ కే పరిమితమైన కేసీఆర్
- ప్రతిపక్ష పాత్ర పోషించలేక చతికిల పడ్డ బిఆర్ఎస్
- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్ సెప్టెంబర్ 03)**



ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తుందని డిసిసి అధ్యక్షులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల సంక్షేమ పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం గంగాధరలో నిర్వహించిన సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగాధర మండల కేంద్రం నుండి మధురానగర్ చౌరస్తా వరకు రెండు కిలోమీటర్లు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్, మధురానగర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాల వేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో 1000 రోజుల సంక్షేమ పాలన పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోని 25 లక్షల మంది రైతులకు రెండు లక్షల లోపు రుణమాఫీ, ప్రతి నియోజకవర్గానికి 6500 ఇందిరమ్మ ఇండ్లు, 9 లక్షల మందికి రేషన్ కార్డులు, 53 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్, 43 లక్షల మందికి చేయూత పెన్షన్లు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనకు నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఎనిమిది లక్షల కోట్ల అప్పుచేసి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులకు కుప్పగా మార్చాలని దుయ్యబట్టారు. ప్రతిపక్ష నాయకుడిగా వెయ్యి రోజులు అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌస్ కేసీఆర్ పరిమితమయ్యాడని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష పాత్ర పోషించలేక టిఆర్ఎస్ పార్టీ చేతికిబడిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని చూసి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారని పేర్కొన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా సంక్షేమం ఆగదని, వెయ్యి రోజులు కాదు, తెలంగాణ రాష్ట్రంలో పదివేల రోజులు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని స్పష్టం చేశారు. 1000 రోజుల సంక్షేమ పాలన సంబరాలకు విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మార్కెట్ కమిటీ చైర్మన్ లు,సింగిల్ విండో చైర్మన్ లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,మహిళా కాంగ్రెస్ యువజన కాంగ్రెస్ ఎన్ఎస్ యుఐ నాయకులు కార్యకర్తలు ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

# విద్యా సంస్థలలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) సెప్టెంబర్ 3**



విద్యాభివృద్ధిలో భాగంగా విద్యా సంస్థలలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని భీమిని మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నాణ్యమైన విద్యా బోధన చేయాలని తెలిపారు. పాఠశాలలో విద్యారుల సంఖ్య పెంపొందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల జారీ, ఓటర్లు సమర్పించిన వివరాల పరిశీలన అంశాలను పరిశీలించారు. మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు అందించిన నోటీసులకు సంబంధించి వారు సమర్పించిన ధృవపత్రాలను పరిశీలించి భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పారదర్శకంగా చర్యలు తీసుకొని, ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మండల తహసిల్దార్ బికర్ణదాస్ లతో కలిసి తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూముల రీ సర్వే, సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. రీ-సర్వే ప్రక్రియలో నిర్దేశిత విధానాలను తప్పనిసరిగా పాటించాలని, ఫీల్డ్ రిజిస్టర్, విలేజ్ రిజిస్టర్‌లలో వివరాలు నమోదు చేస్తూ, సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, రీ-సర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నెన్నెల మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మండల తహసిల్దార్ శ్రీనివాస్ లతో కలిసి సందర్శించి భూముల రీ సర్వే, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల జారీ, విచారణ కార్యక్రమాల నిర్వహణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అదనపు గదుల పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయని, త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. భోజనశాల, వంటశాల లను పరిశీలించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆహారం తయారీలో శుభ్రత నిబంధనలు పాటించాలని సూచించారు. విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. బెల్లంపల్లి మండలం మాలగురిజాల గ్రామ శివారులో గల భూములలో రైతులు వరి సాగు చేస్తున్న విషయాన్ని గమనించి వారితో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందని, అధిక సాగునీటి అవసరం ఉన్న వరి సాగుతో నష్టపోయే ప్రమాదం ఉందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సంక్షేమ అభివృద్ధి సామాజిక న్యాయం

**పటాన్ చేరు, సెప్టెంబరు 3 ప్రజాతీర్పు ప్రతినిధి**

సంక్షేమం -- అభివృద్ధి సామాజిక న్యాయం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. రైతు సంక్షేమం రైతు భరోసా, రైతు రుణమాఫీ వంటి కార్యక్రమాలతో రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం. మహిళా సంక్షేమం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ మహిళా శక్తి వంటి కార్యక్రమాలతో మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు ప్రోత్సాహం. ఇందిరమ్మ ఇళ్లు సొంత ఇల్లు లేని పేద కుటుంబాలకు పక్కా ఇల్లు అందించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం. విద్యాభివృద్ధి విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు, మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా భవిష్యత్ తరాలకు బలమైన పునాది. యువతకు ఉపాధి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచేందుకు నియామకాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత. మౌలిక వసతుల అభివృద్ధి రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ మరియు పట్టణ మౌలిక వసతులను మెరుగుపరుస్తూ అభివృద్ధికి బాటలు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ప్రతి ప్రాంతానికి అభివృద్ధి ప్రతి ఒక్కరికీ సామాజిక న్యాయం ఇదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ కౌన్సిలర్ పర్వతాలు యాదవ్, ఎర్రవల్లి దీనా ప్రవీణ్, మానస రఘు, ప్రవీణ్ నాయక్, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## శామీర్ పేట్ మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన

- నీరసనలో పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

**(వినోద్, ప్రజా తీర్పు, ఎం సి పల్లి, మేడ్చల్ జిల్లా) సెప్టెంబర్ 03**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ శామీర్ పేట్ మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ?కార్యక్రమంలో భాగంగా మొదట అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మల్లారెడ్డి నిరసనలో పాల్గొన్నారు. ?? 22ఏ నిబంధనపై మండిపాటు: కాంగ్రెస్ ప్రభుత్వం 22ఏ పేరుతో సామాన్య ప్రజలు, రైతుల భూములకు సంకెళ్లు వేసిందని, దీనిని వెంటనే రద్దు చేయాలని మల్లారెడ్డి డిమాండ్ చేశారు. రైతు సంక్షేమం: రాష్ట్రంలో తీవ్రమైన యూరియా కొరత నెలకొందని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. ?పాల్గొన్న ముఖ్య నాయకులు: ?డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, ?మూడు చింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, ?మాజీ ఎంపీపీ ఎల్లుభాయి, మాజీ జెడ్పీటీసీ అనిత ?తూంకుంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజేశ్వర్ రావు ?మండల, మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షులు మల్లేష్ గౌడ్, మోహన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కొండల్ ముదిరాజ్ పార్టీ నాయకులు జహంగీర్, కేతమ్మ, కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు.




## భూ సర్వేను సకాలంలో పూర్తి చేయాలి

### అ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్

**(భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భూక్య సందీప్ ప్రజాతీర్పు ప్రతినిధి) సెప్టెంబర్ 03,**

భూముల రీ-సర్వే ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేశ్‌కుమార్ అధికారులకు సూచించారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం ఐడీఓసీలో ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ సర్వే, సాదాబైనామా, రెవెన్యూ సదస్సులు తదితర అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రీ-సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశానికి హాజరైన లోకేశ్‌కుమార్, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి (రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్) రాజీవ్‌గాంధీ హనుమంతును భద్రాద్రి కలెక్టర్ అంకిత్ సాదరంగా ఆహ్వానించి పూల మొక్కను అందజేశారు. ఖమ్మం కలెక్టర్ దివాకర్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సన్న వడ్ల బోనస్ కొరకు ఆన్లైన్ నమోదు తప్పనిసరి

### మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్

**జమ్మికుంట, సెప్టెంబర్ 03 ప్రజాతీర్పు**



తెలంగాణ ప్రభుత్వం నిర్దేశించిన 7 సన్న వరి రకాలను వానాకాలం -2026 లో సాగు చేస్తున్న రైతులు క్వింటాల్ కు 500/- బోనస్ పొందేందుకు తమ సాగు వివరాలను ముందస్తుగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి షేక్ ఖాదర్ హుస్సేన్ తెలిపారు.విత్తనాలు డీలర్ వద్ద కొనుగోలు చేసిన రైతులు పూర్తి వివరాలతో విత్తన డీలర్‌ను సంప్రదించి నమోదు చేసుకోవాలని, సీడ్ ప్లాంట్స్ యూనివర్సిటీ వ్యవసాయ పరిశోధన కేంద్రాలలి నుండి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు ఒక దరఖాస్తు ఫారంతో పాటు విత్తనాల కొనుగోలు బిల్లు, పట్టా పాస్బుక్, ఆధార్ జిరాక్స్ ప్రతులు జతచేసి సంబంధిత ఏ ఈ ఓకి సమర్పించాలనీ, తమ స్వంత వడ్లను విత్తనాలుగా వినియోగించిన రైతులు కూడా దరఖాస్తు ఫారం,పట్టా పాస్బుక్ , ఆధార్ జిరాక్స్ ప్రతులను ఏ ఈ ఓ కి సమర్పించాలని కోరారు. ఆన్‌లైన్‌లో సాగు వివరాలు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే వానాకాలం--2026 సన్న వడ్ల బోనస్ పొందేందుకు అర్హత ఉంటుంది కనుక రైతులు తమ సాగు వివరాలను ఈనెల 8వ తేదీ లోపు కచ్చితంగా నమోదు చేసుకోవాలని తెలిపారు.



## సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ నరసింహ, ఐపీఎస్.

- వినాయక చవితి వేడుకలపై ముందస్తు నిఘా; డీజేలపై కఠిన నిషేధం

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) సెప్టెంబర్ 3**

సూర్యాపేట జిల్లా పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీస్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పి నరసింహ, ఐపీఎస్ గారు ఆదేశించారు. గురువారం రోజున సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఎస్పి గారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను నిశితంగా పరిశీలించి సిబ్బంది విధి నిర్వహణ తీరును మరియు బాధితులకు అందుతున్న సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో అసాంఘిక చర్యలు, అక్రమ రవాణా జరగకుండా పటిష్ట నిఘా ఉంచాలి. పట్టణంలో కొత్త వ్యక్తుల కదలికలను నిరంతరం గమనిస్తూ ఉండాలి, పెట్రో కార్, బ్లూ కోట్స్ సిబ్బంది నిరంతరాయంగా 24 గంటల పాటు క్షేత్రస్థాయిలో గస్తీ నిర్వహించాలి రాత్రి వేళ అనుమానితుల వేలిముద్రలు తనిఖీ చేయాలని అన్నారు. నేరాల నియంత్రణకు పట్టణంలో వీలైనన్ని ఎక్కువ సంఖ్యలో సీసీటీవీ (సి సి టీవీ, కెమెరాలను ఏర్పాటు చేయాలి అని సూచించారు, నిరంతరం వాహనాల తనిఖీలు చేయాలని అన్నారు రానున్న వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలి. స్థానిక పెద్దలతో, ఉత్సవ కమిటీలతో శాంతి సమావేశాలు నిర్వహించాలి. గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధించి కమిటీలు ముందస్తుగా అనుమతులు తీసుకునేలా అవగాహన కల్పించాలి. రాకపోకలకు ఇబ్బంది కలగకుండా రోడ్లపై వినాయక మండపాలు ఏర్పాటు చేయవద్దని స్పష్టం చేయాలి. పట్టణంలో ఎన్ని విగ్రహాలు ఏర్పాటు అవుతున్నాయో ముందే అంచనా వేసి, వాటికి నంబరింగ్ కేటాయించి, నిమజ్జన రూట్లను పరిశీలించాలాని అన్నారు. పండుగల సందర్భంగా డీజేల వల్ల ప్రమాదాలు, మరణాలు సంభవిస్తున్నందున డీజేల వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలి. డీజే నిర్వాహకులను పిలిపించి ముందస్తుగా బైండోవర్ చేయాలి. డీజేల వల్ల కలిగే నష్టాలపై భక్తులకు, ఉత్సవ కమిటీలకు మరియు సాధారణ ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ ప్రజల వినతులు, ఫిర్యాదుల మేరకు స్పందిస్తూ పారదర్శకంగా పనిచేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ నరసింహ గారు హెచ్చరించారు. ఈ తనిఖీలో పట్టణ సిఐ వెంకటయ్య, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, ఎస్ఐ లు సాయిరాం, రామచందర్, రహిముద్దిన్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు



## కేసీఆర్ పాలనలో రైతుల నడ్డి విరిచారు

- బిఆర్ఎస్ నిరసనలపై సొసైటీ చైర్మన్ గోపాల్ నాయక్ మండిపాటు

**నర్సంపేట రూరల్ సెప్టెంబర్ 3, ప్రజా తీర్పు ప్రతినిధి:**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలనపై బిఆర్ఎస్ నాయకులు నిరసనలు చేపట్టడం సిగ్గుచేటని చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్ తీవ్రంగా ధ్వజమెత్తారు. స్థానిక సొసైటీ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గోపాల్ నాయక్ ముఖ్య వ్యాఖ్యలు:రైతు సంక్షేమం కాంగ్రెస్‌తోనే: గతంలో 'వరి వేస్తే ఉరే' అని రైతులను భయపెట్టిన చరిత్ర కేసీఆర్‌ది అయితే, అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీని ఏకకాలంలో అమలు చేసి రైతులను ఆదుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే. గత ప్రభుత్వ వైఫల్యాలు: గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో రుణమాఫీని ఏళ్ల తరబడి వాయిదా వేయడం వల్ల ఆ డబ్బులు వడ్డీలకే సరిపోయాయని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఎస్సీలకు మూడెకరాల భూమి, ఎస్టీలకు 12% రిజర్వేషన్లు అని చెప్పి కేసీఆర్ ప్రజలను మోసం చేశారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యం: కాంగ్రెస్ ప్రభుత్వంలో 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు, నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ, 43 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. మహిళల ఆత్మగౌరవం: ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు మరియు ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల ప్రభుత్వంగా నిలిచారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు ఆవుల రాములు, వట్టే స్వరూప్, తిరుపతి రెడ్డి, నర్సింహారావు, ననుమాస వీరాస్వామి, ఉప సర్పంచ్ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రికి రైలుబాట.. అభివృద్ధికి తొలి అడుగు

- సాకేతపురి వరకు 16 కి.మీ. రైల్వే లైన్‌కు గ్రీన్‌సిగ్నల్
- మంత్రి తుమ్మల విజ్ఞప్తికి కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూల స్పందన.

**(భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భూక్య సందీప్ ప్రజాతీర్పు ప్రతినిధి) సెప్టెంబర్ 03**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి కీలకమైన పాండురంగాపురం--మల్కన్‌గిరి రైల్వే లైన్ నిర్మాణానికి మరోసారి కదలిక వచ్చింది. ప్రాజెక్టు పూర్తికి పలు అవరోధాలు ఉన్న నేపథ్యంలో.. పాండురంగాపురం నుంచి సాకేతపురి (సారపాక) వరకు సుమారు 16 కి.మీ. రైల్వే లైన్ పనులను ముందుగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి.. పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను ఆదేశించారు.

### భూసేకరణకు రాష్ట్రం సిద్ధం

పాండురంగాపురం--మల్కన్‌గిరి పూర్తి రైల్వే లైన్‌కు భూసేకరణ, అటవీ అనుమతులు, గోదావరి వంతెనతో పాటు ఇతర వంతెనల నిర్మాణం వంటి అంశాలు అవరోధాలుగా ఉన్నాయని మంత్రి తుమ్మల కేంద్ర మంత్రికి వివరించారు. వీటి పరిష్కారానికి సమయం పట్టే అవకాశం ఉన్నందున.. పెద్దగా అవరోధాలు లేని పాండురంగాపురం--సాకేతపురి మార్గాన్ని ముందుగా పూర్తి చేయాలని కోరారు. ఈ మార్గానికి అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి రైల్వే శాఖకు అప్పగించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

### భద్రాచలానికి ప్రయోజనం.

సాకేతపురి వరకు రైల్వే సౌకర్యం అందుబాటులోకి వస్తే భద్రాచలానికి రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. దీంతో ఆధ్యాత్మిక పర్యాటకం, స్థానిక వ్యాపారాలు, ఉపాధి అవకాశాలకు ఊతం లభించనుంది.

### పారిశ్రామిక రంగానికీ ఊతం.

రైల్వే కనెక్టివిటీతో జిల్లాలోని సింగరేణి, బీపీఎల్, కేటీపీఎస్ తదితర పరిశ్రమలకు ముడిసరుకు, ఉత్పత్తుల రవాణా సులభతరం కానుంది. కొత్త పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించేందుకు కూడా ఇది దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. కేంద్రం సానుకూల స్పందన నేపథ్యంలో పాండురంగాపురం--సాకేతపురి మధ్య భూసేకరణను వేగవంతం చేసి రైల్వే శాఖకు భూమిని అప్పగించేలా చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. సాకేతపురి వరకు రైల్వే లైన్ నిర్మాణం భద్రాద్రి అభివృద్ధికి కీలక మలుపుగా నిలవనుంది.

# 22-ఎ పేరిట ప్రజల భూములపై ప్రభుత్వ దాడి, హక్కుల హరణపై బీఆర్ఎస్ ఆగ్రహం”

- 22-ఎ పేరిట భూముల బంధీ... బీఆర్ఎస్ నిరసన గర్జన!”.
- “భూముల హక్కులు హరిస్తున్న 22-ఎ... కాంగ్రెస్‌పై విమర్శల వర్షం!”.
- “22-ఎ తో ప్రజలకు ఇబ్బందులు... ప్రభుత్వానికి హెచ్చరిక!”.

(జక్కా వెంకట్ రెడ్డి)

**మేడిపల్లి, సెప్టెంబర్ 3. ( ప్రజాతీర్పు )**




మేడిపల్లి: ప్రజల కష్టార్జితంతో కొనుగోలు చేసిన పట్టా భూములు, ప్రైవేట్ ప్లాట్లను 22-ఎ (రిజిస్ట్రేషన్ నిషేధిత) జాబితాలో చేర్చడంపై బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా పీర్జాదిగూడలోని మేడిపల్లి ఎంఆర్ఓ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల భూములను 22-ఎ జాబితాలో చేర్చి వారి ఆస్తి హక్కులను హరించే అధికారం ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి కష్టపడి సంపాదించిన డబ్బుతో భూములు కొనుగోలు చేసిన రైతులు, మధ్యతరగతి కుటుంబాలు ఇప్పుడు రిజిస్ట్రేషన్లు, భూ లావాదేవీలు, బ్యాంకు రుణాల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల అభ్యంతరాలు, భూ యజమానుల పత్రాలు పరిశీలించకుండా అర్హతలేని భూములను 22-ఎ జాబితాలో చేర్చడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజల భూములను కాపాడాల్సిన ప్రభుత్వం వాటినే వివాదాస్పదంగా మార్చడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ప్రజల ఆస్తులపై కూడా అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. 22-ఎ జాబితా పేరుతో ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం, వారి హక్కులను నిలిపివేయడం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. అర్హతలేని భూములను తక్షణమే 22-ఎ జాబితా నుంచి తొలగించి, భూ యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జక్క వెంకట్ రెడ్డి హెచ్చరించారు. ప్రజల భూములు, ఆస్తుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ చివరి వరకు పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, లేతాకుల మాధవి, రఘుపతి రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కౌడే పోచయ్య, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షుడు ప్రభు, సీనియర్ నాయకులు ఆకుల మధుకర్, యూబీఏ అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ, రమేష్, సతీష్ రెడ్డి, మురళి, రాజేష్ రెడ్డి, నరసింహ రెడ్డి, కోటగిరి శ్రీకాంత్, జగన్ రెడ్డి, శశిధర్ రెడ్డి, యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్ గౌడ్, బుల్లెట్ శంకర్, అశోక్, సతీష్, కిరణ్ నాయక్, పాశం నరేందర్ రెడ్డి, అక్షిత్, వెంకట్, అమర్ పటేల్‌తో పాటు డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

- మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్
- లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీల అందజేత..

**జమ్మికుంట, సెప్టెంబర్ 03 ప్రజాతీర్పు**

రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందిస్తుందని విడతలవారీగా ఇండ్లలు కేటాయిస్తుందని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. గురువారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని పలు వార్డులకు చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తన కార్యాలయంలో ప్రొసీడింగ్ కాపీలను స్థానిక కౌన్సిలర్ తో కలిసి అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వం వారికి ఇండ్లను కేటాయిస్తుందని ఇందులో ఎలాంటి పైరవీలకు తావు లేదని అర్హులైన లబ్ధిదారులను అధికారులు గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లను కేటాయించడం జరుగుతుందని దీనికోసం లబ్ధిదారులు ఎవరు కూడా ఎలాంటి డబ్బులు ఎవరికి చెల్లించాల్సిన అవసరం లేదని సూచించారు. న్యాయంగా అర్హులైన ప్రతి ఒక్కరికి విడతల వారీగా ఇండ్లను కేటాయిస్తుందని స్థానికంగా ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని మీకు 24 గంటలు అందుబాటులో ఉంటానని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ కౌన్సిలర్స్ కొలుగూరి సురంజన్,చింతల శ్రీనివాస్,కొలుగూరి సురేష్,ఫిరోజ్,పోనగంటి విష్ణు,లక్ష్మణ్, రమేష్,జానీ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ పోరుబాట

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్

**జమ్మికుంట,సెప్టెంబర్ 03 ప్రజాతీర్పు**



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు హుజూరాబాద్ నియోజకవర్గంలోని వీణవంక మండల కేంద్రంలో గురువారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు రెండువేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ నాయకులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. “కాంగ్రెస్ బాకీ కార్డు”ను ప్రజలకు పంపిణీ చేస్తూ అమలు కాని హామీలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు దేవాలయాల్లో దేవుడి సాక్షిగా ప్రమాణాలు చేసి ప్రజలకు గ్యారెంటీ కార్డులు అందజేశారని, అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని హామీలను అమలు చేస్తామని చెప్పి నేడు వెయ్యి రోజులు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. “100 రోజుల్లో అమలు” అంటూ ప్రజలను నమ్మించి ఇప్పుడు మాట తప్పారని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్న ఆయన, యూరియా కొరత, రైతు సంక్షేమ పథకాల నిర్లక్ష్యం, సాగునీటి విషయంలో ప్రభుత్వ వైఫల్యం రైతాంగాన్ని తీవ్రంగా నష్టపరిచాయని అన్నారు. రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ వంటి హామీలు అమలు కాక రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారని పేర్కొన్నారు. అలాగే మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెంచిన పింఛన్లు, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా కార్డులు, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ వంటి కీలక హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. ప్రజలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బాకీలను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని పేర్కొన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బండ శ్రీనివాస్, వాల బాలకిషన్ రావు, ముసిపట్ల తిరుపతి రెడ్డి, మాడ సదావ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ కామిడి శ్రీనివాస్ రెడ్డి, సిద్ధిపల్లి మహిపాల్ రెడ్డి, నీల కుమారస్వామి, దాసరపు రాధాకృష్ణ, కాసర్ల సుధాకర్, జక్కు నారాయణ, ముత్యాల శంకర్, నాగిడి సంజీవ రెడ్డి, కాంతారెడ్డి మధుసూదన్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, అడిగిప్పుల సత్యనారాయణ, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే గడ్డం వినోద్

- బెల్లంపల్లి నియోజకవర్గ సమస్యలు,అభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రితో చర్చ

**వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 3**

ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన చర్యలను ఎమ్మెల్యే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా మౌలిక వసతులు, రహదారుల అభివృద్ధి, తాగునీటి సమస్య, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు, పట్టణాభివృద్ధి తదితర అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. అలాగే బెల్లంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేసి, నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరారు ఇప్పటికే ప్రతిపాదించిన, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త అభివృద్ధి కార్యక్రమాలకు ఆమోదం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బెల్లంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ముఖ్యమంత్రి కి వివరించారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రస్తావించిన అంశాలపై ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు సానుకూలంగా స్పందించి, నియోజకవర్గ అభివృద్ధి మరియు ప్రజల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కార్యాలయం వెల్లడించింది. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో సమన్వయంతో పనిచేస్తూ, బెల్లంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి గారు కృషి చేస్తున్నారు.



# హుస్నాబాద్‌లో ఘనంగా తీజ్ ఉత్సవాలు

- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్

**హుస్నాబాద్ సెప్టెంబర్ 03 రవీందర్ ప్రజా తీర్పు**

హుస్నాబాద్ పట్టణంలో గురువారం బంజారా సోదర, సోదరీమణులు ఘనంగా నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీజ్ పండుగ విశిష్టతను, బంజారా సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని కొనియాడారు. బంజారా మహిళలు సంప్రదాయ దుస్తుల్లో నిర్వహించిన తీజ్ వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు.బంజారా సమాజం అభివృద్ధికి, వారి హక్కులు మరియు సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని సతీష్ కుమార్ తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు, మహిళలు, యువత, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బుదరావుపేటలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌కు మార్క్అవుట్

**నర్సంపేట రూరల్ సెప్టెంబర్ 3, ప్రజా తీర్పుప్రతినిధి:**

?బుదరావుపేటగ్రామపంచాయతీలోని వీఓ భవనం సమీపంలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణానికి గురువారం అధికారులు మార్క్అవుట్ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ కాంప్లెక్స్ పూర్తయితే వీఓ గ్రూపు సభ్యులతో పాటు గ్రామీణ ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎంపీడీఓ వి. అద్వైత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓతో పాటు ఎంపీఓ సునీల్ కుమార్, సర్పంచ్ రాణి గోవర్ధన్ రెడ్డి, ఈసీ అరుణ్, పంచాయతీ కార్యదర్శి బాలు, టీఏ వీరబాబు మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# బీసీల కోసం గళమెత్తిన గొంతు మూగబోయింది

- పొన్నం గెలుపుకు కృషిచేసిన గీకురు రవీందర్ అస్తమయం
- కుటుంబానికి అండగా నిలవాలని మంత్రి పొన్నంకు పలువురి విజ్ఞప్తి

**హుస్నాబాద్ సెప్టెంబర్ 03 రవీందర్ ప్రజా తీర్పు**




చిగురుమామిడిలో బలమైన నాయకునిగా ఎదిగిన గీకురు రవీందర్ అనాతి కాలంలోనే మంచి పేరు సంపాదించుకున్నారు. మండల కేంద్రానికి చెందిన బీసీ ఉద్యమ నేత, చిగురు మామిడి మాజీ సర్పంచ్, మాజీ జడ్పీటీసీ, ప్రస్తుత డిసిసి ఉపాధ్యక్షులు గీకూరు రవీందర్ బుధవారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన ఆకస్మిక మృతితో మండల వ్యాప్తంగా తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రజా నాయకుడు, బీసీల కోసం గళమెత్తే బలమైన గొంతుకను కోల్పోయామని నియోజకవర్గ ప్రజలు శోకసముద్రంలో మునిగిపోయారు.

**పోలీస్ ఉద్యోగానికి స్వస్తి.. మలి దశ తెలంగాణ ఉద్యమంలో.**

సురక్షితమైన పోలీస్ ఉద్యోగాన్ని సైతం త్యాగం చేసి తెలంగాణ మలిదశ ఉద్యమంలో గీకురు రవి కీలక పాత్ర పోషించారు. గడపగడపకూ ఉద్యమ స్ఫూర్తిని నింపి మండలంలో ఉద్యమాన్ని ముందుండి నడిపించారు. బీఆర్ఎస్ పార్టీలో కీలక నాయకుడిగా ఎదిగినప్పటికీ, రాజకీయాలకు అతీతంగా బీసీ సంక్షేమం, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడారు. మండలంలోనే కాకుండా హుస్నాబాద్ నియోజకవర్గం వ్యాప్తంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు.

**కొత్త నాయకత్వానికి అండగా నిలిచిన గికురు**

రాజకీయాల్లో ఎంతోమందికి మార్గదర్శకుడిగా నిలిచి అనేకమందిని నాయకులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనది. కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలిచి ‘నేనున్నానంటూ’ ధైర్యాన్నిచ్చారు. ఆయన మరణంతో మండలంలో బీసీల గొంతుక మూగబోయిందని వివిధ బీసీ వర్గాలు, ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మాతృపార్టీని కాదని పొన్నం గెలుపుకు కృషి..**

గత శాసనసభ ఎన్నికల్లో హుస్నాబాద్ నుంచి తెలంగాణ ఉద్యమ నేత పొన్నం ప్రభాకర్ పోటీ చేసిన సమయంలో, గీకురు రవిందర్ తన మాతృపార్టీని సైతం పక్కనబెట్టి ఒక ఉద్యమకారుడిగా పొన్నం విజయం కోసం అహర్నిశలూ శ్రమించారు.

**కన్నీళ్లు పెట్టిస్తున్న కుటుంబ పరిస్థితి.. ప్రభుత్వాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి**

రెండు సంవత్సరాల క్రితమే భార్య మరణించడంతో గీకురు రవికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఇప్పుడు తండ్రి కూడా అనారోగ్యంతో కన్నుమూయడంతో ఆ ఇద్దరు బిడ్డల పరిస్థితి అనాథగా మారి, కుటుంబ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా తయారైంది. మలిదశ ఉద్యమకారులకు, అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచినట్లే.. తెలంగాణ స్ఫూర్తిని నింపిన గీకురు కుటుంబానికి కూడా ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నారు. ఒక బీసీ నాయకుడిగా, తెలంగాణ ఉద్యమ నేతగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక శ్రద్ధ వహించి... గీకురు రవీందర్ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని, ఇద్దరు కుమార్తెల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని పార్టీలకు అతీతంగా విజ్ఞప్తి చేస్తున్నారు. ఏంసి చైర్మన్ కంది తిరుపతిరెడ్డి చిగురుమామిడి తాసిల్దార్ కనకయ్య,ఎంపీడీవో రామ్మోహన్, ఎస్సై జగదీశ్వర్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మార్క రాజు, చిగురుమామిడి గ్రామ సర్పంచ్ భవాని శివప్రసాద్, వివిధ గ్రామాల సర్పంచులు బిఎస్పి పార్టీ జిల్లా నాయకుడు బోయిన్ బాబు, బిజెపి జిల్లా నాయకులు పొన్నం శ్రీనివాస్,దాసరి ప్రవీణ్ ,సైదాపూర్ మండలం గొల్లగూడెం మాజి ఎంపిటిసి మిట్టపల్లి కిష్టయ్య, సర్పంచులు అల్వాల శంకర్, బోయిని రమేష్, మాజీ సర్పంచులు జక్కుల రవీందర్, వంగర మల్లేశం, సుందరగిరి గ్రామ శాఖ అధ్యక్షులు ఎనగందుల లక్ష్మణ్, ముల్కనూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు పూదరి వేణు గౌడ్, వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు, బొడ్డు నాగేశ్వర్ రావ్,వివిధ పార్టీల నాయకులు, అధికారులు, మహిళలు, కుటుంబ సభ్యులు, బంధువులు ,గ్రామస్తులు, ఘన నివాళులు అర్పించారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020